# ఆ తండ్రి అనుగ్రహానికి పాత్రులం కావాలి

***పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ సత్సంగముల నుండి సేకరణ***

భగవంతుడు ఎవరి కెక్కువ సామర్థ్యమున్నది పట్టించుకోడు. ఎవరి కెంత సామర్థ్యమున్నా, వారు ఆ సామర్థ్యాన్నెంతగా లోకహితానికి వినియోగించా రన్నది ఆయనకు ముఖ్యం. అలా వినియోగిస్తుంటే మనలోని ప్రతి సామర్థ్యం పెరుగుతుంది. లేకుంటే తరిగిపోతుంది. క్రీడల దగ్గరనుంచి, భాషాపరిజ్ఞానం నుండి సర్వమూ వినియోగిస్తుంటే పెరుగుతుంది. లేకుంటే తరుగుతుంది. భగవంతు డెవరి నుండీ వారి శక్తికి మించిన సేవను ఆశించడు. వారికున్నంతలో ఎంతగా చేశారో, అందులోని భావమేమో అది ఆయనకు ముఖ్యం.

'లోకహితంతో మనకెందుకు? మన మానాన్న ముక్కు మూసుకుని కూర్చుంటే చాలదా?' అని చాలామంది తలుస్తారు. అది చాలదని క్రీస్తు చెప్పిన కథ, సాయి చెప్పిన కథ తెల్పుతాయి, ఎందుకని?

పరమాత్మే యీ విశ్వరూపంలో సర్వగతుడై యున్నాడు. మన శరీరము, మనస్సుల దగ్గర నుండి సర్వజీవుల రూపాలన్నింటిలోనూ ఆయనే వున్నాడు. ఆయన రూపమైన సృష్టి యావత్తూ చక్కగా విలసిల్లి, వికసించాలని ఆయన సంకల్పము. ఆ సంకల్పాన్ని అర్థం చేసుకుని, ప్రేమతో అందుకు అంకితమయ్యే వారందరూ ఆయన యొక్క అనుగ్రహానికి పాత్రులే. ఒక వంక ధర్మాచరణ చేస్తూ స్వహితం చేసుకోవడం, మన రూపంలోని ఆయనకు సేవ చేయడం--అది కూడా అవసరమే! అందుకే తమో గుణప్రధానులైన అజ్ఞులు తమ దేహ, ప్రాణాలను సాధన పేరిట అనవసరంగా శ్రమ పెట్టుకోవడం కూడా వ్యర్థమేనని 'భగవద్గీత' లో శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.

అట్లాగాక తన సుఖ శ్రేయస్సులు మాత్రమే పట్టించుకొని, తక్కిన సృష్టిని విస్మరించే రాజసిక సాధకుడి ధర్మాచరణ-- యజ్ఞ, దాన, తపః, కర్మలు-- వ్యర్థమేనని కూడా శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు (శ్రద్ధాత్రయ విభాగ యోగం).

ఉత్తములైన సత్వప్రధానులు, దైవీసంపద గలవారు అయినటువంటి సాధువులు ధర్మాన్ని అనుష్ఠించినప్పుడు అందులో సర్వజీవుల శ్రేయస్సు యిమిడియున్నదని సత్వగుణ లక్షణాలు, దైవీసంపదల గురించిన వివరణ భగవద్గీతలో చూస్తే తెలుస్తుంది. "సర్వభూత హితేరతాః"-- అన్ని భూతముల హితమునందు హృదయపూర్వకమైన ప్రీతి గలవారు" అని వారి నిర్వచనం. సాత్విక బుద్ధిగల ధర్మవ్యాధుని వద్ద, సామర్థ్యమెంతున్నా ధర్మరాజు కూడా అతని నుండి నేర్వవలసినదెంతో వుంటుంది. అది క్రీస్తు, సాయి చెప్పిన కథలకర్థం.

సాయి ఏ జీవిని ఆదరించినా, బాధించినా అది తమకే చెందుతుందని అనుభవపూర్వకంగా భక్తులకు నిరూపించారు. క్రీస్తు అనుభవపూర్వకంగా నిరూపించకున్నా వాచా స్పష్టం చేశారు. చివరకు తమను శత్రువులు బంధించి, సిలువ వేయబోతున్నారని శిష్యులకు ముందుగా చెప్పి, తాము మరణానంతరము ధర్మస్థాపనార్థం మరల అవతరిస్తామని, అప్పుడేమి జరుగుతుందో చెప్పిన మాటలు (మత్తై 25:31-46) గమనార్హం.

ఆయన మరల దేవతలందరితో సహా అవతరించి సింహాసనాన్నధిష్టిస్తానని, అప్పుడు అన్ని దేశాలు ఆయన ముందు మందలలాగా చేరుతాయని, ఆ జనంలో గొర్రె పిల్లల

**మిగతా 8వ పేజీలో**

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి: 41 డిసెంబరు - 2023 సంచిక: 08

*పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"*

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | ఆ తండ్రి అనుగ్రహానికి పాత్రులం కావాలి | సత్సంగముల నుండి సేకరణ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | సద్గురు సన్నిధి | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి వెంపటి శ్రీలక్ష్మి | 09 |
| 05. | మాతృదేవి సన్నిధిలో విజయదశమి మహోత్సవం!! | శ్రీమతి టి. పద్మావతి | 11 |
| 06. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 12 |
| 07. | చక్రనారాయణ్ | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 15 |
| 08. | మాతృదేవి సన్నిధిలో పూజ్య భరద్వాజ గురుదేవుల జయంతి మహోత్సవ వేడుకలు | శ్రీమతి టి. పద్మావతి | 19 |
| 09. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 22 |
| 10. | అమరశిల్పి | శ్రీ ఐ. నాగేశ్వర రావు | 23 |
| 11. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి భాగ్య | 26 |
| 12. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి అరుణ | 28 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

**ప్రశ్న :- శ్రీ శిరిడీ సాయిబాబా నా కోర్కెలు తీరుస్తే ఆయనే నా గురువుగా ఎంచుతాను. ఒక విద్యాలయము, వేదాంత గ్రంథాలయము, ఆశ్రమము, అనాథశరణాలయము, సాయిబాబా గుడి నాచేతుల మీదుగా కట్టించాలని నా కోరిక. ఇంతకన్నా పుణ్యమార్గం లేదు.**

**- రమణబాబు, విజయవాడ**

**జవాబు :-** ఈ రోజులలో యీ పనులేవి చేసినా పుణ్యకార్యాలు కాజాలవు. విద్య కావలసిన పిల్లలకు దొంగ మార్కులు, కాపీలు కొట్టించక చక్కని నైతిక విలువలతో కూడిన చదువు యిప్పించాలని తపించే తల్లిదండ్రులు కూడా కరువైపోతున్నారు. కష్టపడి నిర్మించగానే అది అవిద్యాలయంగానూ, క్రమశిక్షణారాహిత్యశిక్షణశిబిరంగాను తయారయ్యేది తథ్యం. కారణం...అలా తర్ఫీదైన టీచర్లే ఎవరికైనా దొరకబోయేది. వేదాంత గ్రంథాలు యిళ్ళలోనే చదివేవారు లేక దుమ్ము, పురుగులు కొట్టుకుంటుంటే గ్రంథాలయా లెందుకు? మనం కోరినది నెరవేరుస్తేనే గురువుగా ఒకరిని అంగీకరించగల యీ తరానికి వేదాంతం అపథ్యం – టైఫాయిడ్ రోగికి పంచభక్ష్య పరమాన్నంలా. ఆశ్రమం కావలసింది సాధకులకు – సాధకులేరి దానిని ఉపయోగించుకోడానికి? ఆ నిర్వహణ వలన రాజకీయాలు, కార్పణ్యాలు, అసూయలు ఏర్పడతాయి, ఆశ్రమవాసుల మధ్య. అంతకుమించి ఏమీ ప్రయోజనముండదు. అనాథ శరణాలయంలోనూ అవే యిబ్బందులొస్తాయి. మీరు చెప్పిన వాటిలో అదొక్కటే కొంచెము వాంఛనీయమనిపిస్తుంది. కానీ ప్రభుత్వం బాగానే చేస్తోంది. వారితో మనమూ కలిసి జీవిస్తూ స్వయంగా మన బిడ్డలుగా వారిని చూచుకోగలిగితేనే దానిని స్థాపించాలి సుమా! ఇక గుడి, ఇది కత్తి, నిప్పులాగా ఎంత మేలు చేయగలదో అంత చెడూ చేయగలదు. ఎంతో ఆలోచించి చేయాలి. అసలు భగవంతుడు ఆశించేది ప్రతి యిల్లు, ఆలయము, ఆశ్రమము, అనాథ శరణాలయము, ఆధ్యాత్మ గ్రంథాలయము, పాఠశాల కావాలని, ప్రతి కుటుంబము ఉత్తమమైన ధర్మక్షేత్రము కావాలని! ఇందుకు సాయి చరిత్ర, గురు చరిత్ర, సాయిబోధలకు తోడు యితర సద్గ్రంథ శ్రవణము, నిత్యము ప్రతి మందిరములోను, ప్రతియింట్లోను జరగాలి. ఎన్ని ఆలయాలున్నా అది జరగడం లేదు. సాయి చెప్పిన జీవిత ధర్మాన్ని అర్థం చేసుకొని పాటించే యత్నం చేయక ఊరికే రాయికి మ్రొక్కినట్లు ఆయనకు మ్రొక్కడం ఆయన కోరలేదు. ఆయనవద్దకు లక్షలాది మంది వచ్చారు. అయితేనేమి, 'నేనివ్వదలచిన జ్ఞానం అడిగేవాడు. తీసుకునేవాడు ఒక్కడు కూడా నాకు కన్పించలేదు. ప్రతివాడు వలనుగాని గొంతెమ్మ కోర్కెలతో నన్ను వేధించేవాడే" అన్నారు కూడ.

ధర్మమేమిటో ప్రజల హృదయాలను ఆకర్షించేలా తెల్పి ఆచరింపచేసే పాఠశాలలు దేవాలయాలని మరువడం వలననే అవి కూడా వ్యాపార సంస్థలుగా మారుతున్నాయి. మేము ప్రచురించిన 'శ్రీ గురుచరిత్ర' ఉపోద్ఘాతంలో శ్రీవాసుదేవానంద సరస్వతి స్వామివారు ఆశించినవన్నీ ఎలా సాధించి నిర్వహించారో, మొదట అందుకవసరమైన దైవ సందేశమొచ్చాకనే ఎలా అందుకు పూనుకున్నారో గమనించండి. ఆ పవిత్రకార్యాలెలా ఆచరించాలో ఆయన చూపారు. శ్రీ రామకృష్ణ పరమహంస గూడ భగవంతుని నుండి తాను ప్రత్యేకమైన ఆదేశం పొందకముందు యిటువంటి కార్యక్రమాలకు ఉపక్రమించరాదని స్పష్టంగా, గట్టిగా హెచ్చరించారు సుమా! బాగా మరలా అవన్నీ చదివి ఆలోచించి అప్పుడు ముందడుగు వేయండి. లేకుంటే జీవితమంతా పరితాపమే, హృదయవేదనే ఎదురయ్యే ప్రమాదమున్నది. ●

(జూలై 2015 సాయిబాబా మాసపత్రిక నుండి)

# సద్గురు సన్నిధి

*పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

సద్గురు సన్నిధి యొక్క ప్రభావం ఎంతటిదో పూజ్యశ్రీ మాస్టరుగారు 'శ్రీ సాయి సన్నిధి' అనే గ్రంథంలో వివరించారు. సద్గురుని భక్తులు వారి సన్నిధిలో తమ జీవితాలను గడిపి ధన్యతమం చేసుకోవాలని కోరుకుంటారు. కారణం వారి సన్నిధికి చేరిన ఎవరికైనా అక్కడ వారికి కావలసిన రక్షణ, అపారమైన శాంతి అనుభవమవ్వడమే. ఇతర విషయాలెన్నివున్నా ఈ రెండు విషయాలలో ఎవరికీ కొంచెం కూడా సంశయముండదు. అందుకని వారి సన్నిధిని పొందనివారు, వారి సన్నిధిలో వుండలేనివారు, వారి సన్నిధిలో నిరంతరం వుంటే ఎంత బాగుంటుందోనని తపన పడుతుంటారు. సద్గురుని సన్నిధిలో వున్నవారిని గూర్చి వారెంత అదృష్టవంతులోనని, తమకూ అట్టి అదృష్టం లభించాలని కోరుకుంటూవుంటారు.

అయితే, సద్గురు సన్నిధి పదునైన కత్తిలాంటిది. అక్కడ జీవితాన్ని గడపడం అలాంటి కత్తిమీద సాములాంటిది. ఈ విషయం వారి సన్నిధిని అనుభవించేవారిలో దాదాపు ఎవరికీ అవగతమవ్వదు. అందుకే వారి వారి సంస్కారాలను బట్టి వారు ఆ సన్నిధిలో ప్రవర్తిస్తూ వుంటారు. అందుకనే కొందరు ఉత్తమ సాధకులుగాను, మరికొందరు సామాన్య సేవకులుగాను వుంటే, ఏ ఒక్కరో ఇద్దరో ఉత్తమ శిష్యులుగా రూపొందుతారు. అంతేగాక మరికొందరు సద్గురువుకు వ్యతిరేకులై అంతటి అదృష్టాన్ని కోల్పోయి భ్రష్టులౌతారు.

అందుకని సద్గురు సన్నిధిలో ఎలా ప్రవర్తించాలో తెలియజేయడానికై పూజ్యశ్రీ మాస్టరుగారు 'శ్రీ సాయిసన్నిధి' అనే గ్రంథాన్ని రచించారు. అందులో కేవలం వారి సన్నిధిలో వున్నవారి జీవిత విధానాన్ని, జరిగిన సంఘటనలను వ్రాయడము మాత్రమేగాక వారివారి సంస్కారాలను, ప్రవర్తనలను గూడ విశ్లేషించి సద్గురువైన సాయి వారిని సాధ్యమైనంత ఉత్తమ సాధకులుగా ఎలా మలచారో వివరించారు. ఆ గ్రంథం గనుక మనం నిదానంగా ఆలోచిస్తూ చదివినట్లయితే మనకు లభించిన, లభించాలనుకునే సద్గురు సన్నిధిని ఎలా ఉపయోగించుకోవాలో అర్థమౌతుంది.

ఎంతటి సద్గురువు వద్దనైనా సరే అన్ని రకాల వ్యక్తులూ చేరుతారు. సద్గురువు వారందరి పట్ల సమానమైన ప్రేమను, అనుగ్రహాన్ని వర్షిస్తూనే వుంటారు. ఆ ప్రేమకు వచ్చినవారి హృదయాలు కట్టుబడిపోతాయి. అయితే ఎవరెవరి సంస్కారాలను బట్టి, పరిస్థితులను బట్టి వారి వారి కోరికలు వుండడంవల్లవారుకోరినవాటినిమాత్రమేసాధ్యమైనంతవరకు సద్గురువులు తీరుస్తారు. 'సాధ్యమైనంతవరకూ మాత్రమేనా? సద్గురువుకు అసాధ్యమన్నది వున్నదా? అసాధ్యమైనది వుంటే మనమెందుకు వారినాశ్రయించాలి?" అనే ప్రశ్న కొందరికి కలగవచ్చు. నిజమే. సద్గురువుకు అసాధ్యమైనదేదీ లేదు. కానీ మన కోరికలు మనకు శ్రేయస్కరమైనవి కానప్పుడు వారు తీర్చరు. ఇది సామాన్యంగా లోకంలో కూడా జరగడం పరిపాటి. పిల్లలకు శ్రేయస్కరమైనది కాకపోతే మనము వారు కోరినది ఇవ్వము కదా! అలాగే ఇదీనూ! ఈ సంగతి అర్థంగాక మహాత్ములు తమ కోరిక తీర్చలేదని కొంతమంది వారిపై అలుగుతారు. మరి కొంతమంది దూరమవ్వడం కూడా కద్దు. అలా వారు అంతటి శ్రేయస్కరమైన సన్నిధిని కూడా చిన్న విషయాల వలన కోల్పోవడం జరుగుతుంది. కొందరు అలాగాక, సద్గురువులు తమకు చేసిన చిన్న మేలును కూడా గుర్తుపెట్టుకుని ఆయన తమపై చూపిస్తున్న ప్రేమకు పరవశించిపోతారు. అట్టివారు సద్గురువులు తమ కోరికలు తీర్చనప్పటికీ, తమను కోప్పడినప్పటికీ చలించక, అది తమ

శ్రేయస్సు కోసమేనని భావించి వారిపట్ల ఇంకా ఇంకా భక్తి భావాన్ని పెంచుకుంటారు. అట్టివారు చివరకు ఏమి చేసినా తమ శ్రేయస్సు కోసమే ఆయన చేశారనే భావనతో నిండివుండడంవల్ల సద్గురువు అనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందుతారు. అట్టివారే సచ్ఛిష్యులుగా రూపొంది, ఒకానొక దశలో సద్గురువులౌతారు. కానీ ఇటువంటివారు ఏ సద్గురువు దగ్గరైనా కొద్దిమంది మాత్రమే వుంటారు. అంటే సద్గురువు యొక్క అనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందడం ఎంత కష్టమో అర్థం చేసుకోవచ్చు. చాలామంది బాబా చెప్పినట్లు మామిడిపూతలాగా రాలిపోయేవారే.

అయితే సద్గురువు చెంతకు వచ్చినవారు ఏ ఏ కారణాలుగా మామిడిపూతలాగా, పిందెల్లాగా, రాలిపోతారో మహాత్ముల చరిత్రలు చూస్తే కొంతవరకూ తెలుస్తుంది. ఒకవేళ మనం సద్గురుని సేవిస్తుంటే ఆయన సన్నిధిలో వున్న ఇతర భక్తులను గమనిస్తే తెలుస్తుంది. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన అంశాలను – సద్గురుని చెంత మన ప్రవర్తన ఎలా వుండాలి అని చెప్పిన వాటిని – మననం చేసుకుంటూ మనలను మనం కూడా నిశితంగా గమనించుకుంటుంటే మనలోవున్న విడువవలసిన గుణాలు అవగతమౌతాయి. ఇతరులను గమనిస్తూ వారి ప్రవర్తనలోని లోపాలు – మనకు కనిపించినవి – ఎలా ఎందుకు వున్నాయో తెలుసుకుని వాటిని మనలోకి రాకుండా చూసుకునేందుకు ఉపయోగ పరచుకోవాలి. 'శ్రీ సాయిలీలామృతం' లో "సామాన్యంగా జరిగేదేమిటంటే సాధకులు తమలోని గుణాలను గాక ఇతరులలోని లోపాలను ఎంచి విమర్శించడం జరుగుతుంటుంది. కానీ నిజానికి ఆధ్యాత్మికతలో ఆత్మవిమర్శ ఒక్కటే తగివున్నది" అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు. అందుకని ఇతరులలో లోపాలు మనకు కనిపించినప్పుడు అటువంటివి మనలో వున్నాయో లేదోనని ఆత్మవిమర్శ చేసుకోవాలి. అందుకు మాత్రమే వాటిని వుపయోగించుకోకపోతే ఇతరులలోని లోపాలను ఎంచడమే పెద్దలోపంగా మనలో తయారవుతుంది. అప్పుడు మనం ఇతరులకంటే గొప్ప లోపం వున్నవారమన్నమాట! ఇది గుర్తుంచుకోవడం అత్యంత ప్రధానమైన విషయం.

అంతేకాదు. కొందరు తామెంతో గొప్ప సాధకులమని తామకు తామే భావించుకుని విర్రవీగుతుంటారు. నిజమైన భక్తులెప్పుడూ వినమ్రతతో వుంటారు. వారి దృష్టి ఎంతసేపటికీ గురువు యొక్క గొప్పదనాన్ని భావించడంలోనే వుంటుంది. గనుక తమ భక్తి గురించి ఆలోచించడానికి సమయముండదు. వారెప్పుడూ గురుసేవలో నిమగ్నులై గురువు యొక్క గొప్పదనాన్ని చెప్పుకుంటూ వుంటారు. ఇక తమ సంగతి చెప్పకోవడానికి సమయమెక్కడుంటుంది? అట్టివారే నిజమైన భక్తులు, సద్గురునికి ప్రీతిపాత్రులు.

అలాగాక సద్గురు సన్నిధిలో కూడా తమ సంస్కారాలెలాంటివో గమనించుకోక, సరిదిద్దుకోక బయట వున్నట్లే అక్కడ కూడా ప్రవర్తించేవారే ఎక్కువమంది. అందుకని వారి ప్రవర్తన బయట వున్నప్పుడెలా వుంటుందో ఆ సన్నిధిలో కూడా అలాగే వుంటుంది. అంతే కాదు, బయట వున్న వారి ప్రపంచం చాలా చిన్నది. అంటే వారి కుటుంబసభ్యులు, పరిచయస్థులతో మాత్రమే వారి వ్యవహారాలు కొనసాగుతాయి. కానీ సద్గురు సన్నిధిలో తమవారు తక్కువగాను, బయటివారు ఎక్కువగానూ వుంటారు గనుక, 'తమ' అన్న భావన తక్కువ వుంటుంది గనుక, అంటే వేరన్నభావన ఎక్కువ వుంటుంది గనుక ఎక్కువ సమస్యలు తలెత్తుతాయి. ప్రతి చిన్న విషయంలోనూ భేదాభిప్రాయం పెరిగి చిలికి చిలికి గాలివానలా చెలరేగి, తుఫానులా విజృంభించి వారి ఆధ్యాత్మిక జీవితాలనేకాక జన్మ పరంపరలను కూడా సర్వనాశనం చేస్తాయి. ఈ విషయాన్ని సద్గురువు ఎంతో బాధగా తెలియచేస్తుంటారు. కానీ ఎవరికివారు తమలో తప్పులేమి లేనట్లుగా అనుకుని వారి హెచ్చరికలను పట్టించుకోరు. ఇటువంటి ప్రవర్తన వలన తమకే గాక సద్గురు సన్నిధి యొక్క పవిత్ర వాతావరణమే కలుషితమై ఎవరికీ మనశ్శాంతి లేకుండా తగవులు, తన్నులాటలతో నిండిపోతుంది. ఇది ఏ సద్గురుని చరిత్ర చూసినా షరా మామూలే.

అందుకని పూజ్యశ్రీ మాస్టరుగారు ఈ విషయం పట్లనే ఎక్కువ శ్రద్ధ తీసుకుని ఇవే జీవితాలను దెబ్బతీసే, శాంతి లేకుండా చేసే విషయాలని నొక్కి చెప్పి వాటిని ఎలా నిర్మూలించుకోవాలో తెలియజేశారు. సరైన సాధనకుగానీ, సద్గురు సన్నిధిని సరైన విధంగా ఉయోగించుకోవడానికి గానీ మన దుష్టసంస్కారాలను తొలగించుకోడమే ప్రధాన కర్తవ్యమని ఆయన ఉద్బోధించారు. "ఊరకే సాధన చేసుకోమని చెప్పడం నా అభిమతం కాదు. సంస్కారాలను సరిదిద్దుకునేందుకు అవసరమైన విషయాలను తెలియచెప్పడమే నా పని. సంస్కారాలను సరిదిద్దుకోకపోతే జీవితంలో అశాంతి తప్పదు. కనుక ఈనాడు ఆధ్యాత్మికతలో కూడా రాజకీయాలు, కోట్లాటలు చివరకు హత్యలు కూడా కొన్ని చోట్ల జరగడం ఈ కారణంగానే అన్నది సుస్పష్టం.

కనుక నేనిదే ప్రధానమైన అంశంగా స్వీకరిస్తాను, ఉద్బోధిస్తాను" అని చాటి చెప్పారు పూజ్యశ్రీ మాస్టరుగారు. ప్రతి విషయంలోనూ ఈ అంశాన్నే ఎత్తి చూపారు గనుక చాలామందికి ఆయన విధానం నచ్చలేదు. అయినప్పటికీ ఆయన చలించలేదు. తాము నమ్మిన సిద్ధాంతాన్ని ప్రచారం చేసుకుంటూ పోయారు. అట్టి ఆయన దగ్గరకూడా కొందరు విభేదించారు, మరికొందరు విరోధులయ్యారు. అన్ని సిద్ధాంతాలవలెనే ఆయన చెప్పిన విషయాలను కూడా విపర్యయంగా విశ్లేషించేవారు కూడా వున్నారు. ఆయన ఇలా చెప్పలేదంటే అలా చెప్పలేదు, ఇలా చెప్పారంటే అలా చెప్పారు అని వాదించుకుంటున్నవారున్నారు. ఇది ఇప్పటికీ, ఎప్పటికీ కూడా లోకవ్యవహారమే. లోకం తీరు అలాంటిది.

అయితే ఇప్పుడు మనమేమి చేయాలి? అన్నది ప్రశ్న. ఏమి చేయాలో మనం ఆలోచించనవసరం లేకుండానే పూజ్యశ్రీ మాస్టరుగారు 'శ్రీ సాయినాథ ప్రబోధామృతం' లోను, 'శ్రీ సాయిసన్నిధి' మొ॥న ఇతర గ్రంథాలలోనూ, తమ ప్రవచనాలలోను చెప్పివున్నారు. భ్రమరకీటన్యాయంలాగా ఆయనచెప్పిన,ఆయనఆచరించినవాటినినిరంతరంమననం చేసుకుంటూ, మనలో ఆయన చెప్పిన మంచి విషయాలను పెంపొందించుకుంటూ, ఏవి తొలగించుకోవాలని చెప్పారో ఆ విషయాలను తొలగించుకోడానికి ప్రయత్నిస్తూ వుండడమే చేయాలి. అప్పుడు మనలోని మార్పు మనకే తెలుస్తుంది. ఇది పైన చెప్పుకున్నట్లు బయట ప్రపంచంలోవున్నా, సద్గురు సన్నిధిలో వున్నా కత్తిమీద సాములాటిదే. హృదయపూర్వకంగా, నిజాయితీగా పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు నడుచుకోవడానికి ప్రయత్నిస్తుంటే ఇది ఎంతో బాగా అనుభవంలోకి వస్తుంది. అయినప్పటికీ మనం కోరుకునేది సద్గురునియొక్క అనుగ్రహమేనన్న విషయం ఎంత దృఢంగా అంటిపెట్టుకునివుంటే అంతగా అయన ప్రేమకు పాత్రులమౌతాము. ఇది కూడా సద్గురువుల వద్ద ఉత్తమ శిష్యులుగా రూపొందినవారి జీవితాలను చూస్తే చక్కగా తెలుస్తుంది. కనుక మనం ఆయన అనుగ్రహానికి 'పాత్రులమౌదామా, వద్దా అన్నది' మనమే నిర్ణయించుకోవాలి.

ఈ గురుపూర్ణిమ సందర్భంగా మనం పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు నడుచుకోవడానికి ప్రయత్నిద్దాము. ఆయన అనుగ్రహానికి పాత్రులమౌదాము.

జై సాయిమాస్టర్!

## ఆ తండ్రి అనుగ్రహానికి పాత్రులం కావాలి

03వ పేజీ తరువాయి

వంటి అనుయాయులు ఆయన కుడివైపునా, ఆయన చెప్పిన మార్గం నుండి వైదొలగి ప్రవర్తించిన మేకల వంటివారు ఎడమవైపునా సమావేశమవుతారని, అప్పుడు తాము కుడివైపు వారితో, "మీ తండ్రి అనుగ్రహానికి పాత్రులైన మీరు పరలోకరాజ్యంలో ప్రవేశించండి. కారణం నేను ఆకలిగా వున్నప్పుడు మీరు అన్నం పెట్టారు; దప్పికగొన్నప్పుడు నీరిచ్చారు; అతిథిగా వచ్చినప్పుడు నా కాశ్రయమిచ్చారు; నేను నగ్నంగా వుంటే గుడ్డలిచ్చారు; నేను జబ్బు పడ్డప్పుడు నన్ను పరామర్శించారు; నేను ఖైదులో నున్నప్పుడు నన్ను చూచి వెళ్లారు" అన్నారు. అప్పుడు ఆయన శిష్యులు ఆశ్చర్యపోయి "మీరు ఆకలిదప్పికలు గొనడము, అతిథిగా రావటమూ, దిగంబరంగాను, జబ్బుగాను, లేక ఖైదులోను వున్నప్పుడు మేము చూడలేదే?" అని అంటారు. అప్పుడు ఆ ప్రభువు ఇలా అంటారు: "నా సోదరులైన పైన చెప్పినటువంటి వ్యక్తులు ఎంత తక్కువ వారైనా సరే, వారికి మీరేమి చేస్తే అది నాకు చేసినట్లు." అప్పుడు ఆయన తమ ఎడమవైపు నున్న వారితో యిలా అంటారు: "పొండి దౌర్భాగ్యులారా, నరకానికి పొండి! నేను ఆకలిగొనియున్నప్పుడు మీరు నాకేమీ తినేందు కివ్వలేదు; దప్పికగొని యున్నప్పుడు తాగేందుకు నీరు యివ్వలేదు". అప్పుడు వారిలా అంటారు-- "స్వామీ! మీరు ఆకలి, దప్పిక గొనియున్నప్పుడు మేమెప్పుడు చూశాము? చూచి కూడా సేవించనిదెప్పుడు?" "అలాంటి వారికి మీరేమీ చేయకుంటే నాకు చేయని వారే అవుతారు. అలా చేయనివారు చిరకాలం నరకాగ్నిలో మ్రగ్గుతారు" అన్నారాయన.

సృష్టి సర్వమూ భగవంతునిదే! దీనిలో ప్రతి వస్తువు, ప్రతి జీవి మిగిలిన వాటన్నింటికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపయోగపడేరీతిన సృష్టించాడు. మేధాశక్తి గల మనిషికీ సంగతి తెలుసుకునే శక్తిని కూడా యిచ్చాడు. మహనీయుల ద్వారా తెలియజేశాడు. కనుక అన్ని రూపాలలో వున్న పరమాత్మకు మన శక్తి సామర్థ్యాలన్నింటితో సహాయం చేయమనే సర్వ మతగ్రంథాలు చెబుతున్నాయి. అది నిజానికి సహాయము కాదు; భగవంతునిది మరల ఆ రూపాలలోని భగవంతునికే యిస్తున్నాము. ఇవ్వని వాడు దొంగ అని భగవద్గీత! దొంగను శిక్షించడం సహజం.●

# మాతృదేవి స్మృతులు

**శ్రీమతి వెంపటి శ్రీలక్ష్మి**

నాగోలు సత్సంగ సభ్యురాలు శ్రీమతి వెంపటి శ్రీలక్ష్మి పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి లీలావైభవాన్ని ఈవిధంగా తెలియజేస్తున్నారు.

నేను మొట్టమొదట పూజ్యశ్రీ అమ్మగారిని చిక్కడపల్లిలో దర్శించుకున్నాను. నాకు పరిచయ భాగ్యం కలిగించింది మా ఇందిర వదినగారు. నేను గచ్చిబౌలి నుంచి వస్తుండేదాన్ని. నేను స్కూల్లో జాబ్ చేయడం వల్ల సెలవలప్పుడు, చిక్కడపల్లి అమ్మగారి నిలయంలో ముఖ్యమైన కార్యక్రమాలు జరిగేటప్పుడు తప్పకుండా దర్శనానికి వెడుతుండేవాళ్ళము.

ఆ రోజుల్లో మా కాలనీలో కొన్ని కుటుంబాలవాళ్ళం కలిసి శ్రీ లలితా సహస్రనామ పారాయణ చేసుకునేవాళ్లం. ఒక గురువారం నాడు మా ఇంట్లో పారాయణ చేసుకుంటున్నాం. నేను లలితా అమ్మవారి ఫొటోతో పాటు శ్రీ సాయిబాబా, పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగార్ల చిత్రపటాలు పెట్టుకునే దాన్ని. పారాయణ అయ్యాక నివేదనకి ఏర్పాట్లు చేసుకుని, దక్షిణ తీసుకువద్దామని లోపలకివెళ్ళి మావారిని అడిగితే రెండు కొత్త ఐదు రూపాయల నోట్లు ఇచ్చి, "ఒక రూపాయి అక్కడుంది తీసుకో" అన్నారు. నేను ఆ రూపాయి మాట మర్చిపోయి, పూజ దగ్గర తాంబూలంలో ఒకొక్క దాంట్లోనూ ఐదైదు రూపాయలు పెట్టాను. ఈలోపున మా గుమ్మం దగ్గరకి ఒకాయన వచ్చారు. లుంగీ, పైన లాల్చీ, భుజానికి జోలె, చేతిలో నల్లటి భిక్షా పాత్ర, తలకి గుడ్డ చుట్టుకుని వున్నారు. ఆయన ఏదో అంటున్నారు. ఆ భాష ఏమిటో అర్థం కాలేదు. పూజకి వచ్చిన వాళ్ళు, "ఇంకా నైవేద్యం అవ్వలేదు, కాస్సేపు ఆగు" అంటున్నారు. నేనన్నాను, "వుండండి, అలా వెళ్ళమనకండి. ఈ రోజు గురువారం. ఇప్పుడే పూజ అయ్యింది కదా, ఆయనకి ఏదైనా ఇచ్చి పంపిస్తాను" అని. అక్కడున్న కొన్ని పళ్ళు, తాంబూలం తీసుకునివెళ్లి ఆయన భిక్షా పాత్రలో వేసాను. ఆయన మళ్ళీ ఏదో అన్నారు. అంటే నేను, "ఇప్పుడు నాకు ఇంతకంటే అవకాశం లేదు" అన్నాను. ఇంకేమి అనకుండా ఒకలాంటి చిన్న నవ్వు నవ్వి వెళ్లిపోయారు. ఆయనని ఒకసారి చూద్దాం అని ఒకరిద్దరు లేచి గుమ్మం వైపు వెళ్లారు. మేము నాలుగవ ఫ్లోర్ లో ఉండేవాళ్ళం. లిఫ్ట్ లేదు, ఫ్లోర్ కి పదహారు మెట్లు, ఆ వచ్చినాయన ఇవన్నీ దిగి వెళ్ళాలి. మావాళ్లకి ఆయన కనపడలేదు. కొంతమంది కిందకి వెళ్లి వాచ్-మెన్ ని కూడా అడిగారు. "ఎవ్వరు రాలేదమ్మా. నేను బైటవాళ్ళని, రానిస్తానా" అన్నాడు. ఇక మిగిలిన పూజ పూర్తి చేసి, అందరికి ప్రసాదాలిచ్చి పంపించేసాను.

ఇక్కడ నించి అసలు కథ మొదలు. నేను బాబాలాగా వచ్చిన వ్యక్తితో, 'నాకు ఇంతకంటే అవకాశం లేదు' అన్నాను కదా! ఆ మాట నాకు తెలియకుండానే, నాకు తారసపడిన వ్యక్తులందరితో అంటున్నాను. ఆఖరికి స్కూల్ లో కూడా. ఇలా నాలుగు రోజులు గడిచాక, ఇంట్లో మావారు ఏదో అంటే, అదేమాటన్నాను. ఈయన విసుక్కుని, "ఏమిటి అస్తమాను అదేమాట అంటున్నావ్?" అన్నారు. అప్పుడు తట్టింది, నాలుగు రోజులుగా, ఎవరేమన్నా ముందు ఇదే మాట వస్తోందని. "ఓహో! ఆ రోజు ఆయనతో అన్న మాట కదా యిది!" అని అప్పుడు గుర్తుకొచ్చింది. కొంచెం భయం వేసింది. వెంటనే పూజ్యశ్రీ అమ్మగారికి ఫోన్ చేసి, ఆయనకి దక్షిణ ఇచ్చిన దగ్గర నుండి, నాలుగురోజులుగా జరుగుతున్నదంతా చెప్పుకొచ్చాను. అప్పుడు పూజ్యశ్రీ

అమ్మగారు, "నువ్వు యెంత దక్షిణ పెట్టాలనుకున్నావో, (అంటే ముందు నేను, బాబాకి 11, మాస్టరుగారు అమ్మగారికి 11 రూపాయలు అనుకున్నాను. కానీ మావారు యిచ్చిన పదిరూపాయలనే సర్దేశాను) అంత దక్షిణ ప్రతి గురువారం, పసిపిల్లలకిగాని, పిచ్చివాళ్ళల్లాగ వున్న వాళ్లకి గాని, అవకరం వున్న వాళ్లకి గాని, యివ్వు" అన్నారు. "ఎన్నాళ్ళు అమ్మగారు?" అని అడిగాను. "ఇస్తూ వుండు, చూద్దాం" అన్నారు. నేను అలాగే చేస్తుండేదాన్ని. కొన్నాళ్ళకి, ఆ మాట నాకు తెలియకుండానే నా నోటినించి పోయింది. ఆ తరువాత, మళ్ళీ పూజ్యశ్రీ అమ్మగారితో, "మీరు చెప్పినట్లే చేస్తున్నానమ్మా" అని చెప్తే, "అంతే, అలా చేస్తూ వుంటే సరి" అన్నారు. ఇక అప్పుడు బాబాకి నమస్కారం చేసుకుని, "బాబా క్షమించు, నీకు యివ్వవలసిన దక్షిణ పూర్తిగా యివ్వలేక పోయాను" అనుకుని, ఆ నెల నించి జీతం రాగానే, ఒక భోజనం ప్యాకెట్ పార్సెల్, పళ్ళు దానితోపాటు దక్షిణ కూడా యిచ్చేదాన్ని. అప్పటి నించి నా ఇంట్లో అన్ని సమృద్ధిగా వుండటం మొదలయ్యింది. పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల బాబా నన్ను క్షమించి, అనుగ్రహించారు.

అమ్మగారు నాగోలుకి వెళ్ళినప్పుడు మేము కూడా గచ్చిబౌలి నించి నాగోలుకి వచ్చేసాము. అంతవరకూ, ఒకవేళ ఎప్పుడైనా రాత్రి టైములో, చిక్కడపల్లినించి గాని, మల్కాజిగిరి నించిగాని బయలుదేరి గచ్చిబౌలికి వెళ్ళినప్పుడు, పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల ఎప్పుడు ఎలాంటి యిబ్బంది వుండేది కాదు.

పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల గురుకుటుంబంతో యాత్రలలో పాల్గొనే అదృష్టం కలిగింది. ఒకసారి, పూజ్యశ్రీ అమ్మగారు ఒంగోలుకి వెళ్ళినప్పుడు, నేను కూడా వెళ్లాను. అక్కడ నేను ఒక పాఠం నేర్చుకున్నాను. ఒక రోజు పూజ్యశ్రీ అమ్మగారు, భిక్ష లోకి, నన్ను ఒక కూర చెయ్యమన్నారు. అది ఎలా తరగాలో, ఎలా చెయ్యాలో వేదమ్మని అడగమన్నారు. సరేనని, వేదమ్మని అడగడానికి వెడితే, వేదమ్మ అప్పుడు అందుబాటులో లేరు. కొంచెంసేపు ఎదురు చూసి, ఇంక వీలుకాకపోతే, అక్కడ వున్న వేరే సేవకులనడిగి కూర చేసేసాను. అంతా సిద్ధం అయ్యాక పూజ్యశ్రీ అమ్మగారు "కూర చేసావా?" అని నన్ను అడిగారు. "చేసానమ్మగారు" అన్నాను. "వేదమ్మని అడిగే చేసావా?" అన్నారు. జరిగినదంతా చెప్పాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "నేను ఎవరిని అడగమంటే వాళ్లనే అడగాలి గాని, వేరే వాళ్ళని ఎందుకు అడిగావు?" అన్నారు. అప్పుడు నేను 'సమయం అయిపోతోందని' అంటూ గొణిగాను. అయినా సరే, "ఏదైనా సూటిగానే వుండాలి గాని, పక్కదారులు వెతకకూడదు" అని అన్నారు. అది నాకు ఈనాటికి చక్కటి పాఠం లాగా మనసులో గుర్తుండిపోయింది. అప్పుడు, "చింకి గుడ్డలెందుకు దొంగిలిస్తావ్? నీకు జరీశాలువా ఇవ్వదలచాను" అన్న బాబా సూక్తి గుర్తుకువచ్చింది.

మేము నాగోలు వచ్చాక, పూజ్యశ్రీ అమ్మగారు నాకొక సేవ ఇచ్చారు. కొన్ని గులాబీ మొక్కలు నా చేత పెట్టించారు. తరవాత, "గులాబీ మొక్కలకి నీళ్లు పట్టడం, ఎరువు వేయడం, కొమ్మలు కట్ చేయడం. ఇలాంటివి చేస్తావా" అని అడిగారు. నాకు నిజానికి మొక్కలంటే చాలా ఇష్టం. వెంటనే సరేనన్నాను. ప్రతి రెండురోజులకి ఒకసారి, నన్ను పిలిచి ఆ గులాబీ మొక్కల సంరక్షణ ఎలా చేస్తున్నానని అడిగేవారు. నా దగ్గర సమాధానం ఉండేది కాదు. ఎందుకంటే ప్రతిరోజూ మర్చిపోయేదానిని. ఇంటికి వెళ్ళాక ఏరాత్రి సమయంలోనో గుర్తుకు వచ్చేది. రేపు ఎలాగైనా చెయ్యాలి అనుకునేదానిని. తీరా నిలయానికి వెళ్ళాక, వేరే పనిలోపడి ఇది మర్చిపోయేదాన్ని. కొన్నిరోజులయ్యాక,,,,,పూజ్యశ్రీ అమ్మగారితో "క్షమించండి అమ్మగారు, ఎందుకిలా జరుగుతోందో తెలియటం లేదు, అంటే", "ఎందుకంటే అశ్రద్ధ వల్ల. అది వుండకూడదు కదా" అన్నారు. నేను, "పొరపాటయ్యింది అమ్మగారు, శ్రద్ధగా చేస్తాను" అని చెప్పగానే, వెంటనే అమ్మగారు చిరునవ్వుతో "అలాగే" అన్నారు. అప్పుడు నాకు 'ఒప్పుకున్న పని సక్రమంగా చేయి, లేకుంటే ఒప్పుకోకు', అన్న బాబా సూక్తి గుర్తుకు వచ్చింది.

ఇలా ప్రతిక్షణం మమ్మల్ని సరిచేస్తూ, మా జీవితాలని సరిదిద్దుతూ, సుఖశాంతులను ప్రసాదిస్తున్న పూజ్యశ్రీ అమ్మగారిని, వారికి ప్రీతి కలిగేటట్టు నడుచుకునే శక్తిని ప్రసాదించమని, నిరంతరం వారి సన్నిధిలో, వుండే భాగ్యాన్ని అనుగ్రహించమని వేడుకుంటూ, హృదయ పూర్వక శత సహస్ర వందనాలర్పిస్తున్నాను.●

# మాతృదేవి సన్నిధిలో విజయదశమి మహోత్సవం!!

**శ్రీమతి టి.పద్మావతి**

విజయదశమి అంటే దేవీ నవరాత్రుల సందర్భంగా జరుపుకునే అతి ముఖ్యమైన పండుగగా అందరికీ తెలుసు. అంతే ముఖ్యంగా శ్రీ శిరిడీ సాయినాథులవారు మహాసమాధి చెందిన పర్వదినంగా కూడా ఎంతోమంది జరుపుకుంటారు. ఇంతటి మహోత్సవం గుమ్మళంపాడులో శ్రీ మాతృదేవి సన్నిధిలో ఏ విధంగా జరిగిందో అందరం తెలుసుకుందాం.

విజయదశమి రోజు ఉదయాన్నే మేలుకొలుపు సేవలతో పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో ఉత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మేలుకొలుపు అనంతరం ముగ్గురు మూర్తులకు కాఫీ నివేదనచేసి, తదుపరి సమాధి రూపంలో భాసిల్లుతున్న పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లికి విశేషమైన మంగళ స్నానాలు గావించి, అలివేలుమంగా సహిత భరద్వాజలకు గురురూపమై వెలుగొందిన శ్రీ శిరిడీ సాయినాథులవారి మూర్తిని సమాధిపై సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆ తర్వాత శ్రీమతి వేదమ్మగారిచే సాయినాథునికి అష్టోత్తర శతనామావళి సహిత షోడశోపచార పూజ జరుపబడింది. పూజానంతరం శ్రీమతి వేదమ్మగారు సత్సంగం చేశారు. అందులో కొన్ని విషయాలు:

నేను సత్సంగం చేసే ప్రతిసారి పూజ్యశ్రీ బాబాగారికి, మాస్టరుగారికి, అమ్మగారికి ప్రార్థన చేసుకొని సత్సంగం మొదలు పెట్టడం అలవాటు. ఆ ప్రార్థనని నాకు పూజ్యశ్రీ అమ్మగారు వ్రాసి యిచ్చి, ఆ విధంగా చేయమని చెప్పారు. అయితే యీమధ్య ఒకరికి ఒక ప్రశ్న వచ్చింది. అదేంటంటే, 'మీరు సత్సంగం ముందు ప్రార్థన చేస్తూ శ్రీ సాయినాథులవారిని మన హృదయంలోకి, ఎదురుకుండా వున్న పీఠంలోకి ఆహ్వానించుకుందాం అని చెప్తారు కదా, హృదయంలోకి, పీఠంలోకి కూడా ఎందుకు ఆహ్వానించాలి?' అని ప్రశ్నించారు. చాలామందికి యీ ప్రశ్న మనసులో వుండొచ్చు. ఒకరు నన్ను యిది అడిగారు కనుక చక్కగా సమాధానం చెప్పుకుందాం. ఏంటంటే మనం బాబా, అమ్మగారు, మాస్టరుగారు మూర్తులని చక్కగా పీఠాన్ని ఏర్పరచుకొని దాని మీద ఫోటోల రూపంలో అలంకరించుకుంటాం. కానీ వారిని అందులోకి ఆహ్వానించుకోము. ఈ రెండిటికి చాలా తేడా వుంది. బాబా పటం మీద గౌరవం వుంటుంది కానీ ఈ ఏర్పాట్ల హడావిడిలో అక్కడ బాబా అందులో కొలువైవున్నారు అనే భావం చాలా తక్కువ స్థాయిలో వుంటుంది. ఆ భావాన్ని నిలుపుకోవడం కోసం, అది మామూలు పటం కాదు బాబానే వున్నారు అని మన మనస్సును కూడా పవిత్రంగా పెట్టుకోవడం కోసం మన 'హృదయం లోకి' అని కూడా చెప్పడం జరుగుతుంది. మనం ఎదురుగా పటంలో వున్నది బాబా అని గుర్తించి ఆ భావాన్ని దృఢపరుచుకొని సత్సంగం చేసుకోవడం ముఖ్య ఉద్దేశం. అందుకోసం రెండిట్లోకి ఆహ్వానించుకోవడం జరుగుతుంది

అయితే యీరోజు యింకొక విశేషం కూడ వుంది. కొన్ని సంవత్సరాల క్రితం విజయదశమి పండుగకి కొన్ని రోజుల ముందు పూజ్యశ్రీ అమ్మగారికి ఎముకలకి సంబంధించిన

***మిగతా 21వ పేజీలో***

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 12వ ప్రసంగము

మధ్యాహ్నము కాలాభాయి నిత్యానంద స్వామి వారిని ఇలా ప్రశ్నించాడు:-

"ఆత్మను దేహము ఇంద్రియాలకు భిన్నంగా ఎలా చూడాలి?"

స్వా॥ని॥ :-

*శ్లో॥ తం స్వాచ్ఛరీరాత్ ప్రవృహేన్*
*ముంజాదివేషీకాం ధైర్యేణ ।*
*తం విద్యాచ్ఛుక్రమమృతం*
*తం విద్యాచ్ఛుక్రమమృతమితి ॥*

(శ్రుతి)

భావం: ముంజ గడ్డి నుండి దాని ఈనెను తీయాలంటే ఎంతో జాగ్రత్తగా తీయాలి. అలాగే బుద్ధిమంతుడు స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలకు భిన్నమైన మహాకారణరూపమైన ఆత్మను చూడాలి. అది పరిశుద్ధమైన అమృతస్వరూపమని తెలిసికోవాలి.

తైత్తరీయోపనిషత్తులో స్థూల శరీరంలో అన్నమయ కోశము, సూక్ష్మ శరీరంలో ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాలు, కారణ శరీరంలో ఆనందమయ కోశము వున్నాయని చెప్పబడింది. కోశాలు అంటే ఆవరణలు. కత్తిని వర(ఒర) ఆవరించి వున్నట్లు అన్నమయము మొ॥న పంచ కోశాలు (ఐదు కోశాలు) ఆత్మస్వరూపానికి ఆచ్ఛాదనగా వుంటాయి.

శ్రీ విద్యారణ్యులు పంచదశిలో ఇలా చెప్పారు:-

*శ్లో॥ అన్నం ప్రాణో మనో*
*బుద్ధిరానన్దశ్చేతి పంచ తే ।*
*కోశా స్తైరావృతః స్వాత్మా*
*విస్మృత్యా సంసృతిం వ్రజేత్ ॥*

భావం: అన్నము, ప్రాణము, మనస్సు, బుద్ధి (విజ్ఞానము), ఆనందము అనేవి ఐదు కోశాలు. వాటిచేత ఆవృతమైన ఆత్మవిస్మృతి వలన ప్రపంచాన్ని పొందుతాడు (వాటిచేత కప్పబడి వుండి తనను తాను మరిచిపోవడం వలననే ఈ ప్రపంచ ప్రజ్ఞ పొందుతాడు మానవుడు).

### అన్నమయ కోశము:

***స్యాత్ పంచీకృత భూతోత్థో దేహః స్థూలోఽన్నసంజ్ఞకః***

భావము: పంచీకృత మహాభూతాల నుండి (పంచభూతాల నుండి) ఉద్భవించిన స్థూల శరీరము అన్నమునుండే పుట్టి పెరగడం వలన 'అన్నమయ కోశము' అనబడుతుంది. అన్నమయ కోశము యొక్క ఉత్పత్తి, వినాశము జరగడం

కనిపిస్తుంది. ఉత్పత్తి, వినాశములు కల వస్తువు కుండ మొ॥న వాటిలాగానే అనాత్మ అవుతుంది. ఆత్మ అనాది, అవినాశి. కాబట్టి అన్నమయ కోశము ఆత్మకాదు.

స్థూలమైన దేహము బాల్యవస్థ, యువావస్థ, వృద్ధావస్థల చేత వికారం పొందుతుంది. ఆత్మ అవికారి. కాబట్టి అన్నమయ కోశము (స్థూల దేహము) ఆత్మ కాదు.

అన్నమయ కోశాన్ని ఆత్మ అని అంగీకరించినట్లయితే కృతనాశము, అకృతాభ్యాగమము అనే రెండు దోషాలు పడతాయి.

***కృతనాశము:*** అంటే చేసిన కర్మల ఫలితాన్ని అనుభవించకుండా అన్నమయ కోశము (స్థూల శరీరము) ద్వారా పుణ్య పాపాలు ఏమి చేసినా వాటిని ఈ శరీరంలో వున్నప్పుడే అనుభవించకుండా నశించిపోతాయి అని అంగీకరించాల్సి వస్తుంది.

***అకృతాభ్యాగమము:*** అంటే చేయని పుణ్యపాపాలకు సుఖ దుఃఖ రూపమైన ఫలము లభించడం.

కొత్తగా ఉత్పన్నమైన శరీరము ఏ పుణ్యపాపాలు చేయకుండానే పుట్టిన సమయం నుండి సుఖదుఃఖానుభవాన్ని పొందుతుంది. కర్మను ఆచరించనిదే కర్మ ఫలాన్ని పొందడం శాస్త్ర విరుద్ధము.

నేను లావుగా వున్నాను, నేను బలహీనంగా వున్నాను, నేను మనిషిని – అనే ప్రతీతులందు 'నేను' అనే శబ్దము ద్వారా ఆత్మకు బదులు శరీరంలో కలిగే ప్రతీతి రక్త స్ఫటికము (ఎర్రటి స్ఫటికము) మొ॥న వాటిపట్ల కలిగే భ్రాంతి లాంటిది. ఎర్రని పువ్వు తెల్లటి స్ఫటికము క్రింద వుంచినప్పుడు దాని ఎరుపు రంగు స్ఫటికములో కనిపించి స్ఫటికము ఎర్రగా వుంటుందనే భ్రాంతిని కలిగిస్తుంది.

ఇలానే స్థూలత్వము (లావు), కృశత్వము (సన్నము), మనుష్యత్వము మొ॥న భ్రాంతి శరీరంలో కలుగుతుంది.

నా శరీరము ఆరోగ్యంగా వున్నది, అనారోగ్యంగా వున్నది మొ॥న అనుభవాలు కూడా అందరికీ కలుగుతాయి. అనుభవం చేత దేహానికి ద్రష్ట, సాక్షి అయిన ఆత్మ దేహానికి భిన్నమని (శరీరానికి అతీతమని) ఋజువౌతుంది. ఇలానే శృతి, యుక్తి, అనుభవము మొ॥న ప్రమాణాలన్నింటి చేత కూడా ఆత్మ స్థూలశరీరానికంటే వేరైనది (భిన్నమైనది) అని ఋజువౌతుంది.

## ప్రాణమయ కోశము:

***లింగేతు రాజసైః ప్రాణైః ప్రాణః కర్మేంద్రియైస్సహ ।***

భావం : లింగదేహములోని రజోగుణయుక్తములైన ప్రాణ, కర్మేంద్రియాలు ప్రాణమయకోశము అనబడుతుంది.

అపంచీకృత మహాభూతాల నుండి రజోగుణము చేత జనించిన ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు అనబడే పంచప్రాణాలు; వాక్కు, చేయి, పాదము, గుదము, లింగము – ఈ ఐదు కర్మేంద్రియాలు కలిసి ప్రాణమయకోశమనబడతాయి.

ప్రాణమయకోశ స్వరూపాన్ని విద్యారణ్యులవారు ఇలా సెలవిచ్చారు:–

***శ్లో॥ పూర్ణో దేహే బలం***
***యచ్ఛన్నక్షాణాం యః ప్రవర్తకః ।***
***వాయుః ప్రాణమయో***
***నాసావాత్మా చైతన్య వర్జనాత్ ॥***

భావం: దేహంలో వ్యాపించి వుండి బలము కలిగించేది, ఇంద్రియాలను ప్రవర్తింపజేసేది అయిన వాయువు ప్రాణమయకోశము. ఇది చైతన్య రహితమైనదవడం వలన ఆత్మ కాదు.

ప్రాణానికి క్రియాభేదాలననుసరించి 5 వేరు వేరు పేర్లు వున్నాయి.

1. హృదయంలో వుండి ఆకలిదప్పులనే కోరికలను కలిగించేది ప్రాణము.
2. గుదములో వుండి మలమూత్ర విసర్జన చేసేది అపానము.
3.నాభిలో వుండి మనము తినడం ద్వారా త్రాగడం ద్వారా తీసుకునే అన్నము, నీరు మొ॥న వాటిని జీర్ణము చేసేది సమానము.
4. కంఠంలో వుండి శ్వాసను నడిపేది ఉదానము.
5. శరీరమంతటా వుండి అన్న రసాలను సమ్మేళనము చేసేది వ్యానము.

ఈ ఐదు ప్రాణవాయువులే కాక మరి ఐదు ఉపవాయువులు కూడా వున్నాయి. ఇవి – పృథ్వి, జలము, తేజము, వాయువు, ఆకాశము అనే ఈ ఐదింటి యొక్క రజోగుణము చేత ఉద్భవించి, ప్రకటనము, కనురెప్పలు కదల్చడము, తుమ్మడము, ఆవలించడము, శవాన్ని ఉబ్బేలా చేయడము అనే క్రియలను చేస్తాయి. వరుసలో

ఈ ఉపవాయువులు నాగము, కూర్మము, కృకరము, దేవదత్తము, ధనంజయము అని పిలువబడతాయి.

శరీరంలోని బలము ప్రాణము వుండడం వల్లనే వుంటుంది. కాబట్టి ప్రాణమయ కోశం చేత - కళ్ళతో రూపాన్ని చూడగలగడం, చెవి ద్వారా శబ్దాన్ని వినగలగడం, చర్మం ద్వారా స్పర్శను గ్రహించడం, నాలుక ద్వారా రుచిని తెలుసుకోవడం, ముక్కు ద్వారా వాసన చూడడం - ఇవన్నీ చేయగలిగే శక్తి ఉంటుంది. అలానే ప్రాణమయ కోశం ద్వారానే చేతులతో పట్టుకోవడానికి, కాళ్లతో నడవడానికి - ఇలానే ఐదు కర్మేంద్రియాలలోను తమ తమ పనులను నిర్వర్తించగలిగే శక్తి వుంటుంది.

కానీ ప్రాణాలు, కర్మేంద్రియాలు రజోగుణం వలన పుట్టినవి. ఆత్మ జన్మలేనిది. ప్రాణమయ కోశం క్రియాశక్తి కలిగి వుంటుంది. ఆత్మ నిష్క్రియము. ప్రాణాలు చేసిన ప్రతి పనీ ఆత్మ నుండి శక్తిని గ్రహించే చేయబడుతుంది. ఆత్మ చిత్స్వరూపమైన చేతనము, ప్రాణవాయు వికారము కావడం వలన బాహ్యమైన వాయువు ఆత్మ కానట్లుగానే ప్రాణవాయువు కూడా ఆత్మ కాదు. 'నాకు ఆకలి దప్పులు కలుగుతున్నాయి' అనే అనుభవాలు ఎర్రటి స్పటికమనే అనుభవం లాగానే భ్రమ రూపము కలిగి వుండటం వలన ప్రాణానికి ఆత్మ రూపము సిద్ధించదు. 'శరీరం నుండి, ప్రాణం పోయింది, జీవుడు పోయాడు' అనే లోక వ్యవహారాలు కూడా ప్రాణమయ కోశంలో ఆత్మ యొక్క తాదాత్మ్యము నుండి వచ్చిన అభిమానము చేతనే జరుగుతాయి. కాబట్టి ప్రాణమయ కోశము ఆత్మ కాదు.

## మనోమయ కోశము:

*సాత్త్వికైః ధీన్ద్రియైః సాకం విమర్శాత్మా మనో మయః ।*

భావం: సంశయాలతో కూడిన మనస్సు, జ్ఞానేంద్రియాలు కలసి మనోమయ కోశమనబడుతుంది. విమర్శాత్మ అనబడే పంచ మహాభూతాల సాత్త్విక అంశము యొక్క కార్యరూపమైన సంకల్పవికల్పాత్మకమైన మనస్సు, అపంచీకృత మహాభూతాల సత్త్వగుణము నుంచి పుట్టిన పంచజ్ఞానేంద్రియాలు - అంటే చర్మము, కన్నులు, చెవులు, నాలుక, ముక్కు - ఈ ఆరు కలసి మనోమయ కోశము.

*శ్లో॥ అహంతాం మమతాం దేహే*
*గేహాదౌ చ కరోతి యః ।*
*కామాద్యవస్థయా భ్రాన్తో*
*నాసావాత్మా మనోమయః॥*

భావం : శరీరంలో 'శరీరమే నేను' అనే అహంభావము, స్త్రీ (భార్య), పిల్లలు (కొడుకులు), ఇల్లు, ధనము మొ॥న వాటిపట్ల 'నావి' అనే మమత్వము (మమకారం) కలిగి వుండేది కావడం చేత, మనోమయ కోశము దేహము మొ॥న వాటిలాగా ఉత్పత్తి (పుట్టుక) వుండటం చేత ఆత్మకాదు.

## విజ్ఞానమయ కోశము :

*"తైరేవ సాకం విజ్ఞానమయో ధీః నిశ్చయాత్మికా ।"*

భావం: పంచ మహాభూతాల సత్త్వగుణము చేత ఉద్భవించిన నిశ్చయాత్మకమైన బుద్ధి, జ్ఞానేంద్రియాలూ కలిసి 'విజ్ఞానమయ కోశము' అని పిలవబడుతుంది.

*శ్లో॥ లీనా సుప్తౌ వపుర్బోధే*
*వ్యాప్నుయాదానఖాగ్రగా ।*
*చిచ్ఛాయోపేతధీర్నాత్మా*
*విజ్ఞానమయ శబ్ద భాక్॥*

భావం : సుషుప్తి (నిద్ర)లో లయమై, మెలకువ స్థితిలో గోరు నుండి తలదాకా శరీరమంతటిలో వ్యాపించివుండేది, చిచ్ఛాయ కలిగినది అయిన బుద్ధి విజ్ఞానమయ కోశము. అది ఆత్మ కాదు.

విజ్ఞానమయ కోశము ఆత్మకాదు. ఎందుకంటే అది నిద్రావస్థలో అజ్ఞానంలో లయమౌతుంది. కానీ ఆత్మ నాశము లేనిది. ఎల్లప్పుడూ ప్రకాశిస్తూ వుంటుంది. మనోమయ, విజ్ఞానమయ కోశాలు ఒకే అంతఃకరణలోని విభాగాలు. అయినా మనస్సు అంతర్గతమయ్యే దాని సాధనము అంటే ఇంద్రియము. కాబట్టి బాహ్యమైన వృత్తి కలది. విజ్ఞానాత్మ (బుద్ధి) కర్త అనబడుతుంది. అది అంతర్వృత్తి కలది. ఇలా కరణత్వ, కర్తృత్వ భేదము చేత బాహ్యత్వ అంతరత్వ భేదము చేత ఒకే అంతఃకరణము మనోమయ విజ్ఞానమయ కోశాలనే రెండు పేర్లు కలిగివున్నది. సత్త్వ రజోగుణాల అవస్థా భేదము చేత లింగ దేహంలో ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయాలనే మూడు కోశాలు వేరువేరుగా చెప్పబడ్డాయి. రజోగుణావస్థ ప్రాణమయ కోశము. సత్త్వ రజోగుణాలు కలిగిన అవస్థ మనోమయ కోశము. కేవలసత్త్వ గుణావస్థ విజ్ఞానమయ కోశము.

**- సశేషం**

# చక్రనారాయణ్

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

శ్రీ సాయి అవతారకార్యం, తమనాశ్రయించిన జీవులకు శాశ్వతమైన శ్రేయస్సు, దానిని వ్యతిరేకించనంతమేరకు లౌకికమైన సుఖశాంతులు ప్రసాదించడానికి మాత్రమే పరిమితంగాక, వీటిలో మొదటి లక్ష్యంలో భాగమైన నైతిక పునరుజ్జీవనం మన జాతికంతటికీ కల్గించడంగూడానని ఖాపర్డేగురించిన అధ్యాయంలో గమనించాము.

ఆయనకు అందుకు చేతికి అందుబాటులో వున్న సాధనాలు రెండు; 1) హిందూ ముస్లిం సమైక్యత, వర్ణభేదాలకతీతమైన ప్రేమానుబంధాలు: 2) నైతికబలాన్ని చేకూర్చగల ఆధ్యాత్మ గ్రంథ పఠనము - ఏకనాథ భాగవతము, జ్ఞానేశ్వరి మొ॥నవి చదివించడము. ఈ రెండు ఆశయాలను ప్రజలలో ఆచరణాత్మకంగా సాధించడానికి ఆయన తన భక్తులచేత శ్రీరామనవమి - ఉరుసు ఒకే రోజున, ఒకే వేడుకగా అందరూ కలిసి చేసుకోవడం నేర్పించారు. కుల మత భేదాలను పాటించకుండా సహపంక్తి భోజనం మశీదులోను, భోజన గృహంలోను అలవాటు చేయించారు. అందరూ కలసి ఆరతి, చావడి ఉత్సవము, భక్తులకు ప్రసాదమిచ్చే ముందు ఫాతిహా చేయించడము, ధునికి నైవేద్యమర్పించడము చేయించారు. పరమత ద్వేషం లేకుండా సోదర భావంతో ఎవరి మతధర్మాన్ని వాళ్ళు పాటించుకొనేలా చేశారు.

ఆ కాలంలో మన దేశాన్ని పరిపాలిస్తున్న తెల్లవారి ప్రభుత్వం వీరి కార్యాన్ని అంతదూరం అర్థం చేసుకున్నదో లేదోగాని, దానివలన ప్రత్యక్షంగా తమ అధికారానికి ముప్పు వాటిల్లుతుందేమోనని భయపడింది. ఖాపర్డే, కాకా దీక్షిత్ వంటి రాజకీయ ప్రముఖులు శిరిడీలో తలదాచుకొనడం, లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వంటివారు వారి దర్శనానికి రావడము తెల్లవారి దృష్టిని ఆకర్షించింది. భక్తిని ఆధారంగా చేసుకొని శ్రీరామనవమి - ఉరుసు ఉత్సవాల ద్వారా ప్రజలు సంఘటితమవడం తమ అధికారానికి మంచిదికాదని వెరచి ప్రభుత్వాధికారులు అవి జరుగకుండా చూడాలని యత్నించారుకూడ. ఆ ఉత్సవానికి మొదట ప్రభుత్వం అంగీకరించలేదు. కాని తర్వాత ప్రజాభిప్రాయానికి తలవొగ్గక తప్పలేదు. సాయి మొదట ప్రకటమైనది 1854లో. రెండవసారి శిరిడీవచ్చి స్థిరపడినది 1856 చివరిలో. సరిగా 1857లోనే మన ప్రజలలో కొద్దిశాతం మాత్రమే తిరుగుబాటు చేసినప్పటికీ తెల్లజాతివారి అధికారం దాదాపు కూలినంత పనయింది. ఆ స్మృతులు వాళ్ళకు సింహస్వప్నంగా నిలిచిపోయాయి.

ఇట్టి భయంతో తెల్ల ప్రభుత్వం శ్రీ సాయిబాబా పైన, శిరిడీ సందర్శించే భక్తుల పైన నిఘా వుంచింది. ఒకవంక అందుకుగాను ఒక పోలీసు కానిస్టేబుల్ ను శిరిడీలోను, కోపర్గాంలోను నియమించింది. శిరిడీకి ఎవరెవరు వచ్చిపోతున్నది, వారక్కడ ఎన్నిరోజులు వున్నది, వారి పూర్వాపరాలు నిత్యమూ ఒక డైరీగా వ్రాసి ప్రభుత్వానికందించాలి. ధూలియా కోర్టులో విచారించబడిన దొంగ దొంగతనం జరిగిన తేదీలలో శిరిడీ వచ్చి వెళ్ళలేదని ఆ డైరీ నుండి తెలుసుకొనే ఆ దొంగతనంతో

బాబాకు ఎట్టి సంబంధమూ లేదని నిర్ధారణ చేసుకున్నది.

ఇది చాలక శిరిడీకి భక్తుల వేషాలతో ప్రభుత్వం గూఢచారులను గూడా శిరిడీకి పంపుతుండేది. ఉదా : ఖాపర్డే శిరిడీలో వుండగా, 'హంస' అనే ఒక 'భక్తుడు' తరుచుగా శిరిడీ వస్తుండేవాడు. ఇతని అసలు పేరు నటేకర్. అతడు ఆధ్యాత్మిక అన్వేషణలో ఎందరో మహాత్ములను దర్శించినట్లు, చివరకు హిమాలయాలలో తనకొక గొప్ప గురువు లభించినట్లు చెప్పుకొనేవాడు; సాటి భక్తులతో ఎన్నో ఆధ్యాత్మిక విషయాలపై రమ్యంగా మాట్లాడుతూ, తాను సందర్శించిన సాధు సత్పురుషుల గురించి రసవత్తరమైన విశేషాలు చెప్పి భక్తుల నాకట్టుకున్నాడు. అందుకే యితనిని అందరూ 'స్వామి' అనేవారు. తాను మానస సరోవరం దగ్గర కొంతకాలం హిమాలయాల్లో పర్యటించినట్లు చెప్పినదంతా నమ్మి, అతనిని అందరూ 'హంస' అని గూడ అనేవారు. బక్కపలచగా మంచి శరీరచ్ఛాయ, తీర్చిదిద్దినట్లుండే ముఖ కవళికలు, మృదుమధురమైన కంఠస్వరం అందరినీ సులువుగా నమ్మించాయి. రోజులో కొద్ది సమయం దప్ప ప్రత్యక్షంగా సాయి ఎదుటకు ఎక్కువసార్లు వచ్చేవాడుగాదు. చివరికి ఒకప్పుడు 1913లో దాదాసాహెబ్ ఖాపర్డే ఇంగ్లండు వెళ్ళినప్పుడు ఈ హంస శిరిడీలో ఆ కుటుంబానికి తనపై ఏర్పడిన సద్భావాన్ని పురస్కరించుకొని అమ్రావతీలోని వారింటికెళ్ళి అక్కడే ఒక మాసమున్నాడు. అతడు వెళ్ళిపోయాక చూచుకొంటే ఖాపర్డేకు చెందిన పాత డైరీలు పది కన్పించలేదు. నిజానికి వాటిని ఒక చెక్క పెట్టెలో పెట్టి తాళంవేసి వుంచారు. అంటే యింట్లో ఎవరికీ తెలియకుండా వాటిని పసిగట్టి, తాళం గూడ పగులగొట్టి తీసుకువెళ్ళాడన్నమాట. అటు తర్వాత చాలా కాలానికి ఈ 'హంస' నిజానికి సాధువు గాదని, ప్రభుత్వం నియమించిన గూఢచారియనీ ఖాపర్డే తెలుసుకున్నాడు. అదృష్టవశాత్తు ఆ డైరీల్లో ప్రభుత్వానికి పనికొచ్చే వివరాలేమి లభించలేదు. అందువలన ప్రభుత్వం వాటిని ఖాపర్డేకు తిరిగి యిచ్చేసింది. డిసెంబరు 29, 1910న తన డైరీలో ఖాపర్డే యిలా వ్రాసుకున్నాడు. "ఆయన (సాయిబాబా), నేనిక్కడ మరో రెండు మాసాలుండవలసి వుంటుందని ఈ రోజు మధ్యాహ్నం కబురు చేసారు. తర్వాత నేను వారిని దర్శించినపుడు ఆయన ఆ విషయం ధృవపరిచారు. తమ 'ఊదీ' కి ఎంతో దివ్యశక్తి వున్నదని చెప్పి, నా భార్యతో, 'గవర్నరు ఒక బరిసె తీసుకొచ్చాడు. నా వద్దనున్న త్రిశూలంతో నేను వాణ్ణి తరిమివేసి, చివరకు అతనికి నచ్చచెప్పి పంపివేశాను' అన్నారు బాబా. వారి పరిభాష ఎంతో నిగూఢంగాను, వివరించడానికి వీలులేనిదిగానూ వున్నది".

సరిగా ఆ తేదీలలో 'హంస' గూడ శిరిడీలోనే వున్నాడు. సాయి చెప్పిన వాక్యంలో 'ఊదీ' అంటే అనుగ్రహమనీ, గవర్నర్ అంటే తెల్ల ప్రభుత్వమనీ, అతడు తెచ్చిన బరిసె-ఖాపర్డేపై ప్రభుత్వం జారీ చేయదలచిన అరెస్టు వారంటనీ మనకర్థమవుతుంది. ఈ విషయం ఖాపర్డే కుమారుడైన బాబా సాహెబ్ గూడ తన గ్రంథంలో వ్రాశాడు 'హంస' రూపంలో నిజానికి శిరిడీ వచ్చినది తెల్లప్రభుత్వం యొక్క ప్రభావమేనని బాబాకు స్పష్టంగా తెలుసు. అయినా వారి అనుమతి లేకుండా అతడు చేయగలిగినదేమున్నది?"

బాబా యిలా తమనాశ్రయించిన ఖాపర్డే యోగక్షేమాలు మాత్రమే చూచుకోలేదు. ఎక్కడో దూరాన దేశ స్వరాజ్యం కోసం పాటుబడుతున్న బాలగంగాధర తిలక్ ను గూడ వేయి కళ్ళతో కనిపెట్టి వున్నారని ఖాపర్డే తన డైరీలో మే 19, 1917న వ్రాసుకొన్న వివరం సూచిస్తున్నది :

"ఈరోజు తెల్లవారు ఝామున నిద్రలేచాను గాని, ఇక్కడెంతో మంది కూడడం వలన ప్రార్థన చేసుకోలేకపోయాను. మమ్మల్నిక్కడే వుంచాలని, మధ్యాహ్నం తర్వాత గాని మమ్మల్ని వెళ్ళనివ్వగూడదనీ, కొందరు కట్టుగా ప్రయత్నిస్తున్నారు. కేల్కర్ గూడ ఆ ప్రయత్నాన్నే బలపరుసున్నట్లు తోచింది. కాని, నాకు తెలియకుండానే నాకు కోపమొచ్చి నేను ప్రయాణమవుతానని పట్టుపట్టాను. తిలక్ మహాశయుడు, మరి కొందరము బయల్దేరి సంగమనేర్ లోని ప్రఖ్యాత న్యాయవాది సంత్ యింట్లో తాంబూలం వేసుకుని మేము ఉదయం 8.30కు బయల్దేరి, 10 గం॥లకల్లా శిరిడీచేరి దీక్షిత్ వాడాలో బస చేశాము. బాపూసాహెబ్ బూటీ, అతని పరివారము, నారాయణరావుపండీ అక్కడ వున్నారు. నా పాత మిత్రులు మాధవరావ్ దేశ్ పాండే, బాలాసాహెబ్ జోగ్ మొ॥న

వారక్కడ చేరారు. మేమందరమూ కలసి మశీదుకు వెళ్ళి సాయి మహరాజ్ ను దర్శించుకున్నాము. ఆయన అంత సంతోషించడం నేనెన్నడూ చూడలేదు. ఆయన లోకమాన్యుల కేసి చూస్తూ, 'మనుషులెంతో దుష్టులు! ఎవర్నీ నమ్మవద్దు, జాగ్రత్త!' అన్నారు. నేను నమస్కరించగానే ఆయన దక్షిణ కోరి తీసుకున్నారు. కేల్కర్, పారే గోంకర్ గూడ దక్షిణ సమర్పించారు. తర్వాత మేమందరమూ యవలా వెళ్ళడానికి మాధవరావు దేశ్ పాండే సాయిని అనుమతి కోరాడు. సాయి సాహెబ్, 'ఎందుకింత ఎండలో వెళ్ళాలనుకుంటున్నారు? దారిలో చావడానికా? అందరూ భోంచేసి సాయంత్రం చల్లబడ్డాక వెళ్ళండి. శ్యామా! వీరిద్దరికీ భోజనం పెట్టు' అన్నారు. కనుక మేముండిపోయి, మాధవరావుతో కలసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాక మళ్ళీ మశీదుకు వెళ్ళాము. సాయి నిద్రపోతున్నట్లుగా క్రింద పడుకుని వున్నారు. మేము చావడికి వెళ్తే గ్రామస్థులక్కడ లోకమాన్యునికి తాంబూలమిచ్చారు. ఆ తర్వాత మేము మళ్ళీ మశీదుకొచ్చాము. అప్పటికే సాయిమహరాజ్ లేచి కూర్చుని వున్నారు. ఆయన మాకు ఊదీ యిచ్చి సెలవిచ్చారు. గనుక మేమందరమూ కారులో బయల్దేరాము".

ఖాపర్డే తమపై తెల్ల ప్రభుత్వం గూఢచారులను నిఘా వుంచిందన్న కారణంగా తన డైరీలో బాబాకు-లోకమాన్యునికీ జరిగిన ఒక సంభాషణ వ్రాయలేదనిపిస్తుంది. అపుడు ఆ బృందంలో వారిననుసరించిన శ్రీ కవియోగి శుద్ధానంద భారతి ఆ వివరం వ్రాశారు. బాలగంగాధర్ తిలక్, "బాబా, మేము మా ఆశయం సాధించుకోగల్గుతామా?" అని అడిగాడుట. బాబా, "అల్లామాలిక్! అది సమయమొచ్చినపుడు భగవంతుడే ప్రసాదిస్తాడు. ఇంతవరకూ అందరికోసమూ శ్రమించావు. ఇక నీ శ్రేయస్సుకోసం గూడ శ్రమించి, విశ్రాంతి తీసుకో, అల్లాహ్ అచ్ఛాకరేగా!" అన్నారట.

మార్చి 13, 1912న ఖాపర్డే డైరీలో యిలా వ్రాసుకున్నాడు: ''సాయిమహరాజు యీ రోజొక సుదీర్ఘమైన కథ చెప్పారు: వృద్ధుడైన ఒక పాటిల్ వారి (సాయి) ని దర్శిస్తుండేవాడు. అతనిపై మొదట నల్గురు, తర్వాత 12 మంది గూఢచారులు నిఘావేసి వుండేవారు. ఒకసారి ఆ వృద్ధునికి, గూఢచారులకూ తగువు జరిగి, తర్వాతొకసారి తీవ్రంగా కొట్టుకున్నారు. సాయిసాహెబ్ ఆ వృద్ధునిపై కనికరించి అతడిని పొలంలో కలుసుకున్నారు. ఒకసారి స్వయంగా ఆయనే ఆ పాటిల్ పై దాడిచేసిన గూఢచారులను కొట్టి తరిమేశారు. చివరకు వాళ్ళు ఆ వృద్ధుని పని పట్టడానికి అతనిని ఒక పెద్ద పట్టణానికి గూడ తీసుకువెళ్ళారు. సాయీ సాహెబ్ జోక్యం చేసుకుని అతనిని విడిపించారు". పైన వివరించిన దేశ పరిస్థితుల దృష్ట్యా యీ మాటలలో సాయి తమ సహజ నిగూఢ రీతిన ఖాపర్డే గురించే అలా చెప్పారో, లేక మరో ప్రజా నాయకుని గురించి అలా చెప్పారో నిర్ణయించడం సాధ్యంగాదు.

ఈ నిఘాలో భాగంగానే తెల్ల ప్రభుత్వం శిరిడీలో చక్రనారాయణ్ అను పోలీసు కానిస్టేబుల్ ను నియమించింది. సాయికి భక్తులు సమర్పించే దక్షిణలు అంచనా వేసి, అవకాశముంటే వాటిపై ఆదాయపన్ను విధించాలన్న నెపంతో ప్రభుత్వం అతనిని నియమించింది. ఆ ప్రభుత్వం యితనినే ఎన్నుకొనడానికి కారణం— అతడు క్రైస్తవుడు. ముస్లింనుగాని, లేక హిందువునుగాని నియమిస్తే మతాభిమానంతో తమ అసలు కార్యం నెరవేర్చరన్న భయంతో ప్రభుత్వం అతణ్ణి నియమించింది. హిందువులు-ముస్లిములూ ఎంత స్వల్పకారణంగానైనా శిరిడీలో ఘర్షణపడితే, అది అవకాశంగా తీసుకొని బాబాపై చర్య తీసుకోవాలని తెల్ల ప్రభుత్వం ఎంతగానో ఆశించింది. కాని సాయి యొక్క అవతార కార్యమన్న మహాసముద్రంలో, యివాళవుండి రేపుపోయే తెల్ల ప్రభుత్వం కాకి రెట్టవంటిది. ఆయనకు వారి గురువు, సర్వానికీ నియంత అయిన అల్లాహ్ అప్పగించిన లోక కళ్యాణ కార్యానికి కేవలం లౌకికమైన ఏ శక్తి అడ్డుకోగలదు- ప్రజల అనర్హత తప్ప?! బాబాను అనుమానించి గమనించడానికి వచ్చిన చక్రనారాయణ్ కు గూడ సాయిని గమనించాక ఆయనపై భక్తి శ్రద్ధలేర్పడ్డాయి. అతడు తను గమనించిన అంశాలు యిలా వ్రాశాడు: –

"బాబా సమాధి చెందిన సంవత్సరము నేను కోపర్ గావ్ పోలీసు ఫౌజుదారుగా

పనిచేస్తున్నాను. నేనపుడు బాబాకు భక్తుడనుగాను. నిజానికి మా పోలీసు శాఖవారి ద్వారా మేము బాబా పై నిఘావేశాము. నేనెంత అనుమానంతో ఆయనను గమనించినప్పటికీ తత్ఫలితంగా నాకాయనపట్ల ఎంతో గౌరవమే యేర్పడింది. అందుకు మొదటి కారణం- ఆయన స్త్రీలు మరియు ధనములపట్ల నిర్లిప్తుడు. ఎందరో స్త్రీలు వచ్చి వారి పాదాలపై శిరస్సు పెట్టి నమస్కరించి, వారి యెదుటనే కూర్చునేవారు. కాని ఆయన పట్టించుకునే వారేగాదు సాయి వారిపై ప్రీతితో గూడిన చూపు ఒక్కసారైనా ప్రసరింప జేసేవారుగాదు. సాయి మోహరహితులన్నది నిస్సందేహం: డబ్బు విషయంలో గూడ వారిని మేము కని పెట్టాము, ప్రజలు తమకై తామే వారికి పైకం సమర్పించేవారు. ఎవరైనా యివ్వకున్నా బాబా వారిని నిందించడము, ద్వేషించడము, లేక అప్రీతి వహించడమూ చేసేవారు గాదు.

భిక్షాటనలో గూడ సాయి వైఖరి యిలానే వుండేది. తమకెట్టి భిక్ష యిచ్చారన్నది గూడ వారేమీ పట్టించుకోలేదు. ఏది లభించినా దానిని ఉదారంగా పంచేసేవారు, వారు సమాధి చెందినపుడు (ఎవరూ కాజేయకుండా) వారివద్ద నున్న పైకం స్వాధీనం చేసుకున్నాము. కాని అది మొత్తం ₹16/-లు మాత్రమే వున్నది. అయినప్పటికీ ఆయన నిత్యమూ వందల రూపాయలు దానం చేస్తుండేవారు. తరచుగా వారు పంచేది వారికి లభించిన దానికంటే ఎక్కువే వుండేది. అలా ఆయన పంచే అదనపు పైకం ఎక్కడినుండి వస్తుందో కని పెట్టలేకపోయాము. అందుకనే ఆయనకు దివ్యశక్తులున్నాయిని మాకు నిర్ధారణైంది.

అన్ని మతాల పట్ల ఆయన ప్రవర్తన ఎంతో ఉన్నతంగా వుండేది. ఆయన యేమతాన్ని, వ్యక్తినీ, సమాజాన్ని, లేక పదవులనూ న్యూనత పరచేవారు గాదు. ఆ గ్రామంలోని ఫౌజుదారు క్రైస్తవుడని ఒకరు ఆయనతో చెబితే 'అయితేనేమి? అతడు నా సోదరుడు' అన్నారు.

వారి శక్తులు అద్భుతమైనవి. ఒక పోలీసు ఆఫీసరు వారిని దర్శించినపుడు బాబా దక్షిణ కోరారు. అతడు తనవద్ద పైకం లేదన్నాడు. అపుడు బాబా "నీ పర్సులో చూసుకో, అందులో ₹50/-ల నోటువున్నది' అన్నారు. అతడు ఆనోటు తీసి బాబాకు సమర్పించాడు, గాని,



బాబా అందులో కొంత మాత్రమే తీసుకొని, 'మిగిలినది త్వరలో నీకు అవసరమౌతుంది' అన్నారు. తర్వాత సరిగ్గా అలాగే జరిగింది. అతడికి కొన్ని చిక్కులొచ్చి ఆ పైకం అవసరమైంది. అవి తీరిపోయాక, సరిగా అంతడబ్బూ కృతజ్ఞతతో శిరిడీ పంపాడు.... బాబా ఊదీ ఎందరి జబ్బులో తగ్గించింది".

**జోసెఫ్ :**

పోలీసు ఫౌజుదారుగా రిటైరయిన జోసెఫ్ అనే క్రైస్తవుడు (బాంద్రా) కూడ యిలా వ్రాశాడు: "నార్వేకర్ కు 1917లో జబ్బు చేసినపుడు అతని కుమారుడు ₹500/-లు తీసుకువెళ్ళి బాబాకు సమర్పించారు. బాబా దానిని తీసుకోగానే, జ్వరంతో 'ఆయన శరీరం వణికిపోనారంభించింది. కారణమడిగితే, 'మేమెవరికైనా మేలు చేయవలసి వస్తే ఎన్నో బరువు బాధ్యతలు మాపై వేసుకోవలసి వుంటుంది' అన్నారు. కొద్దికాలంలో నార్వేకర్ కు జబ్బు తగ్గిపోయింది".

# మాతృదేవి సన్నిధిలో పూజ్య భరద్వాజ గురుదేవుల జయంతి మహోత్సవ వేడుకలు

*శ్రీమతి టి.పద్మావతి*

"ఎన్ని జన్మల పుణ్యమో యిది! ఎన్ని నోముల భాగ్యమో యిది!" అని పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల గురించి వ్రాసిన గీతంలో చెప్పినట్లు, మన అందరి ఎన్నో జన్మల పుణ్యఫలితంగా అటువంటి గురుదేవులు భూమి పైకి రావటం జరిగింది. మరి అంతటి గొప్పవారి ఆగమనం ఉత్సవం కాక మరేమవుతుంది? ఆ ఉత్సవాన్ని గుమ్మళంపాడు మాతృదేవి సన్నిధిలో అత్యంత వైభవంగా జరుపుకున్నారు.

ఆ వేడుకల్లో భాగంగా ప్రతిరోజు లాగే ఆ రోజు కూడా ఉదయం మేలుకొలుపుతో కార్యక్రమాలు మొదలయ్యాయి. పూజ్యశ్రీ బాబావారికి, మాస్టరుగారికి, అమ్మగారికి మేలుకొలుపు భక్తులందరు ఎంతో శ్రద్ధగా చేసుకున్నారు. అక్టోబరు 30వ తేదీ ఉత్సవమయితే, రెండు మూడు రోజుల ముందునించే ఎక్కడెక్కడ భక్తులు మాతృదేవి సన్నిధికి చేరుకున్నారు. ముందు రోజు అంతా ఆ సన్నిధి అలంకరణలో పాలుపంచుకున్నారు. మధ్యలో భరద్వాజ గురుదేవుల మూర్తిని, వారి కుడిపక్కగా పూజ్యశ్రీ బాబావారిని, ఎడమ పక్కగా పూజ్యశ్రీ అమ్మగారిని పీఠంపై అలంకరించారు. ఉదయమే మేలుకొలుపు అనంతరం, పన్నీరు, గంధము, విభూది యిత్యాది సుగంధ ద్రవ్యాలతో సమాధి రూపంలో కొలువై వున్న పూజ్యశ్రీ అమ్మగారికి మంగళ స్నానాలు గావించారు. తరవాత సమాధిపై, భరద్వాజ గురుదేవుల మూర్తిని డ్రైఫ్రూట్స్ తో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల ప్రియ పుత్రులు శ్రీ ద్వారకానాథ్ దంపతులచే పూజ్యశ్రీ మాస్టరుగారికి విశేష పూజ జరిగింది. పూజానంతరం మధ్యాహ్న హారతి చేసి, మహానివేదన సమర్పించి ఆ పూట కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఒంగోలు పట్టణంలో శ్రీభరద్వాజ గురుదేవులు సమాధి స్థితులై విరాజిల్లుతున్నారన్న విషయం అందరికీ తెలిసినదే. ఆ రోజు ఉదయం చాలా ప్రాంతాల నుంచి భక్తులందరూ అక్కడికి విచ్చేసి వారికి భక్తిశ్రద్ధలతో సేవలు చేసుకుని, మధ్యాహ్నం తిరిగి వారందరూ గురుదేవుల ధర్మపత్ని పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి సన్నిధికి వచ్చారు. అప్పుడు ముందుగా గురుదేవుల ప్రియపుత్రిక శ్రీమతి వేదవతిగారు సత్సంగం చేశారు. అందులో కొన్ని విశేషాలు యిక్కడ చెప్పుకుందాము:

"పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితం గురించి ఎంత ఆలోచిస్తే అంత గొప్పగా వుంటుంది. పూజ్యశ్రీ మాస్టరుగారి తండ్రిగారు శ్రీమాన్ అనంతాచార్యులవారు. వారితో వారి గురువుగారు 'నీవు ఏది పలికితే అదే వేదం' అన్నారట. దీన్ని బట్టి వారు ఎంత గొప్పవారో మనకు అర్థమవుతుంది. ఆయన జీవితం ఒక యజ్ఞంలాగా నడిచింది. దాని ఫలితంగా వారి నలుగురు పుత్రులు, నలుగురికీ ఎంతో ఉపయోగపడేవారుగా మనకు లభించారు. అందులో పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి జీవితం చాలా విలక్షణమైనది. అంటే ఏ అవస్థలు తీసుకుంటే అందులో వారు నిష్ణాతులని నిరూపించారు. ఉదాహరణకి బ్రహ్మచారిగా ఎలా వుండాలి అంటే ఆయనే ఉదాహరణ! అదే విధంగా గృహస్థులు ఎలా వుండాలి అన్నప్పుడు కూడా వారినే ఉదాహరణగా తీసుకోవచ్చు. అలా ఎందుకు అన్నారంటే,, ఏ విషయాన్ని అయినా పరిశీలించి పరిశోధించి నిక్కచ్చిగా తేల్చుకోందే, వారు ముందడుగు వేసేవారు కాదు. మరి ఆయన ఉపనయనానికి ఉద్దండ పండితులచే

పెట్టించిన ముహూర్త సమయంలో, పూజ్యశ్రీ మాస్టరుగారి అన్నయ్యగారి అబ్బాయి చనిపోయారు. అదే పరిస్థితిలో మనం వుంటే, మనకి, మన చుట్టాలందరికి అ ముహూర్తం మీద అనుమానం వస్తుంది. కానీ, పూజ్యశ్రీ మాస్టరుగారికి అదే గొప్ప ఉపదేశమైంది. వారిలో చావు పుట్టుకల గురించి అన్వేషణ మొదలైంది. అటువంటి పరిస్థితిలో వారి రెండవ అన్నగారితో శిరిడీ వెళ్లడం జరిగింది. అక్కడ ఆయనకి ఆత్మానుభూతి కలిగింది. అప్పుడు ఆయనలో, నాకు యింతటి ఆత్మానుభూతిని యిచ్చినవారు ఎంతటి గొప్పవారో అనే అన్వేషణ మొదలైంది. ఆ అన్వేషణలో భాగంగా, శ్రీ బాబా గారి గురించి చిన్న వాక్యం ఎవరైనా చెప్తారంటే... అది ఎంత దూరమైనా వ్యయ ప్రయాసలకి ఓర్చి అక్కడికి వెళ్లి, వారిని గురించి ఎంతో ప్రేమగా తెలుసుకునేవారు. ఆ తరువాత వారి వివాహం జరిగింది చాలా చిత్రంగా. అది మహాత్ములు కలిసి నిర్ణయించిన వివాహం. వారి సహధర్మచారిణి అలివేలు మంగమ్మ గారు కూడా అంతటి సాధనాపరురాలు. మహాత్ములందరూ, 'మీ ఇద్దరికీ ఋణానుబంధం వుంది' అని చెప్పి వారి వివాహం చేశారు. కానీ నాకనిపిస్తుంది వాళ్ళిద్దరికీ మనందరితో ఋణానుబంధం వుండడం వల్ల వాళ్ళిద్దరూ ఒకటయ్యారని! గృహస్థాశ్రమంలో కూడా వారికి వారే సాటి! వారిద్దరి జీవితాలు తరచి శోధిస్తే తప్పకుండా వెలలేని ఆణిముత్యాలు దొరుకుతాయి. వాటిని అందుకుని వారికి యిష్టమైన మార్గంలో, శిక్షను, శిక్షణని యిచ్చి మనల్ని నడిపించమని మనసారా ప్రార్థిస్తున్నాను" అంటూ సత్సంగం ముగించారు.

తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రియ పుత్రులు శ్రీ ద్వారకానాథ్ జ్ఞానేశ్వర్ గారు ప్రసంగిస్తూ, "పూజ్యశ్రీ మాస్టరుగారి జన్మదిన సందర్భంగా, యిక్కడికి వచ్చిన వారికి, రానివారికి కూడా అష్టైశ్వర్యాలను, ఆయురారోగ్యాలను, ఆధ్యాత్మికతను, గురుభక్తిని, ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. భగవతారాలన్నీ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం వచ్చాయని మనం చదువుకున్నాం.

కానీ ప్రత్యేకించి దత్తస్వామి, దుష్టులలో దౌష్ట్యాన్ని నిర్మూలించడానికి వచ్చారని గురుచరిత్రలో చెప్తారు. అంటే రావణాసురుడికి 10 తలకాయలు. వాడిని శిక్షించాలంటే వాటిని పడగొట్టాలి, కానీ మనకు చాలా వుంటాయి. అంటే మనకి పరిస్థితులను బట్టి మన బుర్రలో మారిపోయే దుష్ట స్వభావాలు కోకొల్లలుగా వుంటాయి. ఆ రకంగా దుష్ట శిక్షణ అనుకుంటే ఒక్కరు కూడా మిగలరు. ఈ భూమి మీద! పోనీ శిష్టులను రక్షించడానికి అనుకుంటే, అలాంటివారు కూడా కనపడరు. కనుక ఈ రెండూ కాకుండా మధ్యలో వున్న వాళ్ళ కోసం దత్తస్వామి వచ్చారని గురుచరిత్రలో చెప్పారు. అయితే అందులో రెండు భాగాలు వున్నాయి. ముందు దుష్టత్వాన్ని మెత్తటి చెప్పుతో కొట్టి, తర్వాత దానికి పౌడర్ రాయడము. ఆ రెండో భాగం పూజ్యశ్రీ మాస్టరుగారిలో ఎక్కువగా కనిపిస్తుంది. ఎలాంటి వారు వచ్చినా, ముందు వాళ్లని ఆహ్వానించి తర్వాత పారాయణ ద్వారా వారి అవసరాలను తీర్చడం చేసి, తరవాత మొదటి భాగానికి వస్తారు. అదెలాగంటే, పూజ్యశ్రీ మాస్టరుగారు వారిచే విరచితమైన ప్రతి గ్రంథంలోనూ మనలోవున్న లోపాలని విలక్షణమైన పదాల్లో తిట్టారు.. ముఖ్యంగా విజ్ఞానవీచికలు గ్రంథంలో ఐదుగురు గురించి చెప్పి, దాంట్లో నలుగురిలో లోపాలున్నాయని ఒక్క అన్వేషకుడు మాత్రమే తరిస్తాడని చెప్పారు. అలాగే 'ఏది నిజం' లో 'గొర్రెదాటు' విధానం వున్నవాళ్లు పనికిరారని చెప్పారు. ఇలా ప్రతి గ్రంథంలో ఉపోద్ఘాతంలో మన లోపాలకి సంబంధించి ఒక విలక్షణమైన పదాన్ని వాడారు. గురువుగారి జన్మదిన సందర్భంగా ఆ పదాలన్నిటిని తీసుకుని, ఇప్పటినుంచి నేను ఆ లోపాలన్నింటినీ పోగొట్టుకోవాలని సంకల్పం చేసుకుంటున్నాను.

ఈ గొర్రెదాటు విధానాన్ని పక్కనపెట్టి, ఖచ్చితంగా అన్వేషణ చేస్తే మనలో వుండే చాలా లోపాలు సమసిపోతాయి. అందుకు ఈ రోజు మనకు ఎన్నో సౌకర్యాలు వున్నాయి. ఇంటర్నెట్ లో ఆరోగ్యం విషయానికి సంబంధించి, డైట్ గురించి, ఆసనాల గురించి ఎంతో సమాచారం వుంది. మనకి ఏది ఉపయోగం అన్నది చూసుకోకుండా, ఎవడో ఏదో చెప్తే చేసేస్తుంటాం. అలాగే ఎన్నో విషయాలు ఈ రోజు మనకి అందుబాటులో వున్నాయి. పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాల్లో కూడా,,, 'లీలామృతంలో 'ఇది చదివిన అన్ని హృదయాలు సాయి మందిరాలుగా మారాలని,, 'విజ్ఞాన వీచికలలో' ప్రతి ఒక్కరు సత్యాన్వేషణ చేయాలని, వెంకయ్య స్వామి చరిత్రలో, మహాత్ములు అవధూతలు సమాజానికి ఎంత కీలకమో అర్థమవుతుందని, ధ్యానయోగ సర్వస్వంలో చూస్తే, మనసుని నియంత్రించడం ఎలాగో తెలుసుకోవచ్చని",,,,ఇలా పూజ్యశ్రీ మాస్టరుగారి రచనలలో సర్వతోముఖమైన ప్రగతి వుంటుంది. అంటే మానసికంగా బాగుండటం, శారీరకంగా బాగుండడం, సమయం సద్వినియోగం చేసుకోవడం,

సామాజికంగా బాగుండటం,,,, ఇలా నాలుగు రకాలుగా బాగుండేట్టుగా కీలకమైన అంశాలు వారి గ్రంథాల్లో మనకు లభిస్తాయి. ప్రబోధామృతంలో పూజ్యశ్రీ మాస్టరుగారు మనందరికీ పనికి వచ్చే ముఖ్యమైన సమస్యకి పరిస్కారం చెప్పేసారు. "సహజంగా మనలో వచ్చే అనవసరమైన ఆలోచనలు, బలహీనతలు అడ్డుపడకుండా వుండాలంటే ఏం చేయాలి?" అని అందరూ అడుగుతూ ఉంటారు. "ఏముంది,,, వ్యాయామం చేస్తూ బిగింపులు పోతే, ఆ సమస్యలు వాటంతట అవే పోతాయి" అని ఆయన చక్కగా మన సమస్యలకు పౌడర్ రాస్తూవుంటే, మనం వాటిని వింటూ కూడా చదువుతూ కూడా, ఆచరించకుండా ఎగ్గొడుతూ, మాస్టరుగారు ఎంత గొప్పవారో అనుకుంటూవుంటే, ఈ సమస్య ఎప్పటికీ పరిష్కరించబడదు. కనుక యిందాక మనం చెప్పుకున్నట్టు ఏవైతే మనల్ని మంచి మార్గం వైపు వెళ్లకుండా చేస్తున్నాయో వాటన్నిటికీ మాస్టరుగారి గ్రంథాల్లో వున్న పరిష్కారాన్ని ఉపయోగించుకుని వారు చెప్పిన మార్గంలో ముందుకు వెళ్లాలని ప్రార్థిస్తున్నానంటూ వారి ప్రసంగాన్ని ముగించారు.

తర్వాత సాయంత్రం సంధ్యా హారతి జరిగింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన వాళ్ళందరూ కూడా హారతి అనంతరం ప్రసాదాలు తీసుకుని బయలుదేరారు. అంతటితో పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల జయంతి ఉత్సవాలు ముగిసాయి.

## మాతృదేవి సన్నిధిలో విజయదశమి మహోత్సవం!!

11వ పేజీ తరువాయి

శస్త్ర చికిత్స జరిగింది. ఆ సమయంలో ఒక విశేషం జరిగింది.

శస్త్ర చికిత్స జరిగిన తర్వాత పరిస్థితి చాలా ప్రమాదకరంగా మారింది. దాదాపు స్పృహ కోల్పోయిన స్థితిలో వున్నారు. అప్పుడు నేను, ద్వారక, అమ్మ స్పృహలోకి రావడానికి మాట్లాడిస్తుంటే, చాలా స్పష్టంగా అమ్మగారు, "విజయదశమి వస్తోంది కదా, 123 రకాల మందార పువ్వులతో బాబాకు పూజ చేయండి" అని చెప్పారు. 123 పువ్వులా? రకాలా? అని ద్వారక మళ్లీ అడిగాడు. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు '123 రకాలు, పువ్వులు కాదు' అని చెప్పారు. మాకు, అన్ని రకాల మందారాలు వుంటాయా, వున్నా యిప్పుడు దొరుకుతాయా? అని సందేహం వచ్చింది. కానీ తీవ్ర ప్రయత్నం చేసిన మీదట, పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల అన్ని రకాలూ దొరికాయి. విజయదశమి రోజు అన్ని రకాల మందారాలతో నాగోలులో పూజ చేసుకోవడం జరిగింది. పూజ్యశ్రీ అమ్మగారు క్రమేపీ కొలుకున్నారు.. అప్పటినించి ప్రతి విజయదశమికి అన్ని రకాల మందారాలతో పూజ చేసుకోవడం జరుగుతోంది. అంతేకాదు పూజ్యశ్రీ అమ్మగారుకూడా చాలా మందికి వరలక్ష్మీ దేవి లాగా, అమ్మవారిలాగా, కనిపించారు. కనుక ఈ విజయదశమి ముందు వచ్చే తొమ్మిదిరోజులూ (నవరాత్రులు) పూజ్యశ్రీ అలివేలు మంగమ్మతల్లిని అమ్మవారిలాగా భావించి పూజించుకునే వారు కూడా వున్నారు. అదికూడా యీ పండుగ విశేషమే!

ఇక బాబా ప్రాశస్త్యాన్ని గురించి చెప్పాలంటే, శ్రీ సాయి లీలామృతం గ్రంథంలో పూజ్యశ్రీ మాస్టరుగారు 'సాయిబాబా మన జీవిత సమస్యలు అన్నిటికీ పరిష్కార మార్గంగా అవతరించారు' అని రాశారు. అంటే సామాజికంగా, వ్యక్తిగతంగా, ఎటువంటి సమస్యల పరంగానైనా సరే, ఆయన బోధనలోని సారాన్ని తీసుకున్నట్లయితే, దానికి పరిష్కార మార్గం తప్పకుండా దొరుకుతుందని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు. అంతటి మహనీయుడు ఈరోజు సమాధి చెందడం ఎంత వాస్తవమో, ఆయన నిత్యసత్యులు అన్నది అంతే వాస్తవం. ఇంతటి సద్గురువు మనకి లభించి మన లక్ష్యానికి కావలసిన పరిష్కారాలని సూచించడం అన్నది చాలా అద్భుతమైన విషయం. కనుక అటువంటి సద్గురువుకు నచ్చిన విధంగా, ఆయన చెప్పిన విధంగా ప్రవర్తించి, మన లక్ష్యాన్ని చేరుకుంటామని ఈ పర్వదినం రోజున నిర్ణయం తీసుకుందాం, అంటూ సత్సంగం ముగించారు శ్రీమతి వేదమ్మ గారు.

సత్సంగం అనంతరం మహానైవేద్యం చేసి హారతి ఇవ్వడంతో విజయదశమి ఉత్సవాలకి ముగింపు పలికారు.

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

మరలా కొన్నాళ్ల తర్వాత శ్రీ ఆనందమయి అమ్మ అనారోగ్యం పాలైనారు. రక్త విరోచనాలు, వాంతులు ప్రారంభమై యెన్నాళ్లకూ తగ్గలేదు. ఆ వ్యాధి తగ్గిపోయిన తర్వాత ఒక రోజు అమ్మ నవ్వుతూ భక్తులతో, "నా అనారోగ్యం గురించి మీరు యెందుకు అంత కంగారు పడతారు? మీరంతా యీ విధంగా నా దగ్గరకు యింత స్వేచ్ఛగా వస్తున్నారు కదా? నేను ఎవరినైనా రావద్దని అంటున్నానా? అలా అనటం లేదు కదా? ఇలా వస్తున్న వారిని నేను వెళ్ళగొట్టడం లేదు కదా? 'అమ్మా, మీరు సర్వశక్తిమంతులు వ్యాధిని త్వరగా తగ్గించుకొనండి అమ్మా' అని మీరు అంటారు. కానీ చూడండి, మీరు ఎలా వచ్చారో అలాగే వ్యాధులు కూడా వస్తున్నాయి. ఈ శరీరం పై కొన్నాళ్లు ఆడుకుంటాయి. వాటిని మాత్రం ఎందుకు వెళ్లిపోమంటాను? ఎన్ని రోజులు ఆడుకుంటే అన్ని రోజులు వాటిని కూడా వుండనిస్తాను. ఆ తర్వాత వాటంతటవే వెళ్ళిపోతాయి" అన్నారు.

యోగేశ్ దాదా స్వగ్రామంలో మెట్రిక్యులేషన్ పాసై ఖాళీగా వున్న అతుల్ అనే యువకుడు యోగేశ్ దాదాను కలిసేందుకు రమణాశ్రమం వచ్చాడు. తన సంపూర్ణ జీవితాన్ని ఆధ్యాత్మిక సాధనలోనే గడపాలని సంసార బంధాలు సాధనకు ఆటంకదాయకాలు అవుతాయి గనక బ్రహ్మచారిగా వుండిపోవాలని నిర్ణయించుకొన్నాడు. శ్రీ ఆనందమయి మాత దర్శనంతో అతడు ఎంతో ఆనందించి, జీవితమంతా అమ్మ సన్నిధిలోనే గడపాలని నిర్ణయించుకున్నాడు. అతడు వచ్చే సమయానికి కాళికామాత విగ్రహం యింకా సిద్ధేశ్వరి లోనే వున్నది. అమ్మ అతనికి కాళీమాత సేవను విధించారు. కాళికామాతకు సమర్పించే నైవేద్యాలను తయారుచేసే సేవ అతనికి యివ్వబడింది. మూడువేళలా దేవి నివేదనలకు అవసరమైన వంటకాలను స్వయంగా అతడే వండేవాడు. పూజానంతరం యోగేశ్ దాదా, గురుప్రియ, అతుల్ ఆ నైవేద్యాన్ని అక్కడే స్వీకరించేవారు. అమ్మ సన్నిధిలో వుంటున్న భక్తులకు అశ్వినీబాబుగారి ఇంట్లో భోజన ఫలహారాలు సమకూర్చే యేర్పాటు గావించబడింది.

కొద్ది రోజులలోనే రమణాశ్రమ సంపూర్ణ నిర్మాణం జరిగిపోయింది. అమ్మ ఆశ్రమంలోనే నివసించేందుకు తగిన వసతి సౌకర్యాలు, అందుకు కావలసిన నిర్మాణాలు పూర్తి అయి, అమ్మ ఆశ్రమ ప్రవేశం కూడా జరిగిపోయింది. 1929 సంవత్సరం Wమహాలయ అమావాస్య నాడు అమ్మ భోలానాథ్ గారితో కలసి రమణాశ్రమానికి వచ్చారు.

అదే రోజు కాళికామాత విగ్రహాన్ని సిద్ధేశ్వరి నుండి రమణాశ్రమానికి చేర్చాలని అమ్మ అన్నారు. రమణాశ్రమంలో శివ మందిరం, అదే ప్రదేశంలో కాళికామాత మందిరం నిర్మాణం జరగాలని దుర్గాపూజోత్సవాలకు ముందుగానే కాళీమాత ప్రతిష్ఠ జరగాలని అమ్మ ఆదేశించారు. ఆశ్రమంలో యజ్ఞాగ్ని స్థాపనకు యజ్ఞకుండం నిర్మాణం కూడా పూర్తయింది. జ్యోతిష్ దాదా, నాగేంద్రబాబు, భూపతిబాబు అనే భక్తులు అనుకున్న సమయానికి నిర్మాణాలన్నింటినీ పూర్తిచేశారు. కాళీమాత స్థాపనకు సుముహూర్తం నిశ్చయింపబడింది. అమ్మ ఆ రోజు ఉదయాన్నే సిద్ధేశ్వరికి వచ్చారు. కాళికామాతకు పూజాదికములు పూర్తిచేసి, శ్రీ ఆనందమయి మాత వెంట భక్తులందరూ మేళతాళాలతో శ్రీ కాళీమాత ప్రతిమను రమణాశ్రమానికి తీసుకొనివచ్చి మందిరంలో ప్రతిష్ఠించారు. కాళీమాత స్థాన మార్పిడి జరగటం యిది ఐదవసారి. అయితే యీసారి రమణాశ్రమం చేరిన కాళీమాత స్థిరంగా ఆశ్రమంలోనే వుండిపోయింది.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# అమరశిల్పి

శ్రీ ఐ. నాగేశ్వర రావు

**(టి.టి.డి. ప్రచార విభాగంలో పనిచేస్తున్న వీరిని సాయి తత్వ ప్రచారంలో సుశిక్షితుడైన సైనికుడి వలె శ్రమిస్తున్న మాస్టరుగారి ప్రవృత్తి ఎంతగానో ఆకట్టుకొని వారికి చేరువయినారు. ఆ సాన్నిహిత్యంలో వారు చవిచూసిన అనుభవాలను మనతో వంచుకుంటున్నారు.)**

వారితో తిరిగినంతకాలం వారెంత వున్నతులు, వారిలో ఇంత గొప్ప మేధస్సు ఇంత మందిని ఆకర్షించేటటువంటి పరిజ్ఞానం, ఒక గురు సంప్రదాయాన్ని మొత్తాన్ని కూడా నిలబెట్టేటటువంటి ప్రక్రియ అన్న ఎన్నో ఉన్నత శక్తి సామర్థ్యాలున్నాయని ఆనాడే తెలిసివుంటే ఒక్క నిమిషం కూడా మాస్టార్ గారిని వదిలి పెట్టేవారం కామేమో అని యిప్పుడన్పిస్తుంది. ఒక రెండు మూడు నెలలు మాస్టారుగారిని చూడలేక పోవటం తటస్థపడితే "ఒక ఆత్మీయుడిని మనం కలవలేక పోయామే ఏమిటిది" అని మనస్సు విలవిల్లాడేది. అలా అన్పించినప్పుడు వారి దగ్గర కెళ్ళి కూర్చుంటే ఎంతో రిలీఫ్ అన్పించేది. ఏమీ మాట్లాడటం వుండదు. కాని వారిని చూస్తేచాలు. నేనెప్పుడూ వారి దగ్గర కెళ్ళేటప్పుడు పండ్లు గాని, ఏమీ తీసుకెళ్ళే వాడిని కాదు. నా జీవిత కాలం మొత్తంలో నేను వారికేమీ సమర్పించు కోలేదు. ఇది నిజం. పైపెచ్చు ఆయన దగ్గర కెళ్ళినప్పుడల్లా వారి దగ్గర్నుంచి ఏదో ఒక ప్రసాదం మాత్రం తప్పకుండా లభించేది. అయినప్పటికీ వారి ఆదరణలో ఏమీ తేడా వుండేది కాదు. వారికేమీ ఇచ్చుకోలేకపోయానే నన్ను గౌరవించటంలో మార్పేమీ లేదే అన్న ఒక రగడ నా మనస్సులో వుండేది. ఏమి చెప్పమంటారండీ ఆ మహోన్నత వ్యక్తిని గురించి? ఇవన్నీకూడా ఈ రోజున గుర్తుచేసుకుంటుంటే, "విలువైన కాలాన్ని ఎంత వృధా చేసుకున్నాము. వారి దగ్గర చాలా విషయాలు తెలుసుకోవలసింది, తెలుసుకోకుండా పంపించేశామే. నిజంగా మన యెంతగా నష్టపోయాం" అని నాబోటివాడికే అన్పిస్తే ఇక మిగిలిన వారి గురించి ఏం చెప్పగలం?

నేను మొదట నాస్తికుడిగా వున్నప్పటి నా జీవితానుభవాలను అన్నింటిని మాస్టార్ గారికి చెప్పాను. ఎందుకంటే నాకొక విశ్వాసం వుండేది. ఒక గట్టి ఆస్తికుని కన్నా ఆస్తికునిగా మారిన నాస్తికునిలో వుండేటటువంటి మధన, విషయాన్ని తెలుసుకోవాలన్న తపన ఆస్తికునిలో వుండవని ఇప్పటికీ నాకన్పిస్తుంది. అందరి విషయంలో ఏమో గాని నా విషయంలో ఇది నిజం. నాస్తికుల వర్గంలోని మేధువులెందరితోనో నాకు సన్నిహిత పరిచయం వున్నది. వారితో తిరిగేటప్పుడు ఎవరి మీద విమర్శలు చేయాలి, ఎవరిని ఎలా ఎదుర్కోవాలి అనేవి పరిచయానికి ప్రేరకాలు అవుతాయి. మాస్టర్ గారి దగ్గర కొచ్చిన తర్వాత ఒక రకమైనటటు వంటి చనువు, ఒక ప్రేమ, ఒక ఆప్యాయత ఏదో తెలియని విషయాన్ని తెలుసుకుంటున్నాము, సాంప్రదాయం గురించి వివరంగా తెలుసుకుంటున్నాము – అనేటుటవంటి ఒక తృప్తి వుండేది. నా పూర్వపరిచయస్థుల

దగ్గర వాస్తవమైన ప్రేమ, అభిమానం గాని, విశ్వాసం గాని దొరికేవిగావు. అదే మాస్టార్ గారి దగ్గర కొచ్చాక, వారి దగ్గర కూర్చుని మాట్లాడుకుంటుంటే, విషయాలు వింటుంటే ఆయనను వదలి వెళ్ళటం ఇష్టం వుండేది కాదు. కారణం ఆయన అలా ప్రవాహంలా మాట్లాడుతూనే వుండేవారు. ఇక ఎవరన్నా వచ్చి బలవంతాన తీసుకెళితే తప్ప తనంతట తానుగా కదిలేవారుకారు. ఆయన కూర్చున్న చోటు నన్నడిగితే ఒక క్లాస్ రూమ్ అంటాను. వెళ్లిన ప్రతివాడూ పాఠాన్నో, సమస్యనో ఆయన ముందు కన్పరచటం వాటినన్నింటిని కూడా సమాధాన పరచుకొని వెళ్ళిపోవటం. ఇది ఆ క్లాస్ లో జరిగేటటువంటి వ్యవహారం "ఏమిటబ్బా ఎడతెగకుండా సిగరెట్ తాగుతూ కూచోవటం, వీళ్ళందరూ వెళ్ళి నమస్కారాలు చేసుకోవటం" అనేది బయటి వారికి తలనొప్పిగా వుండేది. వాళ్ళకిది తాజా వార్త అన్నమాట- విమర్శ చేసుకోవడానికి. మనకి మంచిని ప్రేమించటం, మంచి విషయాన్ని సేకరించటం చేత కాదు కనుక! అలాంటి వారెన్నెన్నో విమర్శలు చేసేవారు. వీళ్ళంతా గాల్లో కలసిపోయారనుకోండి. అది తర్వాత విషయం.

ఆరోజు అంటే మాస్టార్ గారు సమాధి అయిన రోజు రాత్రి ప్రక్క గ్రామంలో నాకు ఒక ప్రోగ్రాం వుంది. వెళ్ళాను. అక్కడ కూడా చాలాసేపు ఇదే విషయాన్ని మాట్లాడటం జరిగింది. రాత్రి 11 గంటలకి రావటం జరిగింది. రావటం రావటం మాస్టార్ గారింటికే వచ్చాను, ఇంటి కెళ్ళకుండా. అక్కడ నేను, నాతో పాటు నా మిత్రులందరం కూర్చుని వున్నాం - ఈ విషయాలే చెప్పుకుంటూ. ఎంతటి బరువైనటువంటి బాధో చెప్పలేం! అస్సలు మరణము అనేటటువంటిది వుంటుంది. అది సాధారణంగా అందరికి తెలిసినటువంటి విషయాలే, కానీ ఒకరి మరణం అనేది ఇంతమంది మీద ఇంతటి ప్రభావాన్ని కలిగిస్తుందా? నిన్నటి దాకా మనతోపాటు సహచరులుగా వున్నవారు ఇంక వుండరా? ఎక్కడి కెళ్ళిపోయారు? ఏమిటి? అలాంటి ఫీలింగ్ మాకు కలిగింది. సరే ఆ రోజు ఇంకా ఒక విచిత్రమైన అనుభవం. మాస్టారుగారి బుక్స్ అవి చదివినటువంటి ఒక కుర్రవాడు ఏ వూరినుంచో గాని గుర్తులేదు మాస్టార్ గారిని కలవాలని వచ్చాడు. 'మాస్టార్ గారి ఇల్లెక్కడ' అని అడుగుతున్నాడు. మాస్టార్ గారినేమో ఇంకా ఎవరో బంధుమిత్రులు రావాల్సినందువల్ల ఐస్ మీద వుంచారు. నాకు కళ్ళ వెంట నీళ్ళు కార్తూనే వున్నాయి. ప్రతి చిన్న విషయానికి కదిలేటటువంటి మనస్తత్వం నాది. అలాంటిది నాకెంతో ఆత్మీయులైన మాస్టార్ గారు సమాధి కావటం అన్నది భరించలేక పోతున్నాను. తట్టుకోలేక పోతున్నాను. అలాంటి ఆ పరిస్థితులలో ఆ మిత్రుడు రావటం "మాస్టార్ గారు ఎక్కడ" అని అడుగుతుంటే "ఎందుకు బాబు" అని అడిగాను. "ఇక్కడే వున్నార్ట గదా! వారిని చూడాలని వచ్చాను" అన్నాడు. "అయ్యయ్యో! చాలా నష్టపోయావు బాబు! ఒక్కరోజు ముందొచ్చినట్లయితే మాస్టార్ గారితో పరిచయం జరిగి వుండేది. మాస్టారుగారు వెళ్ళిపోయారు" అని చెప్పాను. ఆ రోజు కూడా ఆయనను చూడాలని ఎవరో వ్యక్తి రావటం. కథల్లో చదువుతూంటాం వింటూంటాము చూడండి. ఇలాంటివెన్నో వున్నాయి. గుర్తుకు రావటం లేదు. ఎందుకంటే ఏదో అప్పటికి వినటం వెళ్ళిపోవటమేగాని, రాసిపెట్టుకోటం జరగలేదు. నాకు మంచి విషయాన్ని సమగ్రంగా రికార్డ్ చేయాలన్న సత్సంప్రదాయం గాని, అలవాటు గాని లేక పోవటమే అందుకు కారణం. అంటే మన పెద్దలుగాని మిత్రులుగాని అలవాటు చేయకపోవటమే కారణం. ఇంతెందుకండి ఒక్క మాటలో చెప్పాలంటే అదొక శకమండి. ఆ టైమ్ మరలారాదు.

వారు చేసిన సేవ మాత్రం అపారం. ఒక చక్కని మందిరాన్ని ఒంగోలు కిచ్చారు. వీటన్నిటికన్నా స్పష్టంగా చెప్పాలంటే వేలాది మందిని గాలికి తిరిగేవారిని ఏ సంస్కారం లేనటువంటి వారిని ఆస్తికులుగా, మహాభక్తులుగా ఉత్తమంగా తీర్చిదిద్దారు. మాస్టార్ గారు ఆ టైమ్ లో ఇక్కడకు గనుక రాకపోతే మాలో చాలామంది గూండాలుగా మారి వుండేవారు. మాలో చాలామంది అజ్ఞానులుగా మిగిలిపోయేవారు. మరి అలాంటి వారిని ఎంతమందినో ఉద్ధరించారని స్పష్టంగా చెప్పగలను. ఇందులో నాకెలాంటి సంశయము లేదు. ఐతే ఇంకో రహస్యం కూడా చెప్తాను. మాదగ్గర కూడా మాస్టారుగారి గురించి ఏమీ తెలియకుండానే విమర్శలు చేసేవారు. ఒకరోజు ఒకాయన మాస్టరుగారి గురించి ఏమి తెలియకుండానే విమర్శ చేసాడు. ఆయన ఒక సాంప్రదాయానికి చెందిన గురువుకు శిష్యుడే. ఆయనతోనే నేనన్నాను, "ఎందుకయ్యా, ముప్ఫెయ్యేళ్ళ నుంచి సాంప్రదాయం పేరుతోటి ఒక గురు సాంప్రదాయంలో, ఒక గురువుగారి దగ్గర వుండి అనేక

విషయాలు తెలుసుకున్నానని చెప్పానని, పుస్తకాలు రాశానని విర్రవీగుతున్నావు. నీవల్ల మంచి మార్గంలో మళ్ళిన వారిని ఐదు మందిని చూపించు చాలు. ఈ రోజున మాస్టార్ గారి దగ్గరకొచ్చి నిలబడి మాస్టార్ గార్ని గురించి నువ్వు ఛాలెంజ్ చేస్తే వేలమంది నిలబడి ఇదయ్యా నీకు తెల్సిన జ్ఞానం అని చెప్పి నిన్ను యటాక్ చేయగల్గినటువంటి యువతరాన్ని ఆయన తయారు చేశాడు. నిజంగా వేదాంతాన్ని గురించి మాట్లాడ్డానికి ఏ అర్హత లేని వాళ్ళం మేము. మాకే శాస్త్ర జ్ఞానం తెలీదు, పాండిత్యమూ లేదు. ఏ సద్గురువు దగ్గరా ఇనీషియేషన్ తీసికొని మీకు మల్లే భీకరంగా ప్రవర్తించటం లేదు. కానీ మాస్టారుగారు మలిచినందువల్ల ఈ రోజు మీలాంటి వారు చేసే విమర్శలకి సమాధానం చెప్పగలం" అని బట్టలు తెల్లగా చేయడానికి చాకలి ఎలా ఉతుకుతాడో, అలా ఉతికేశాను ఆయనను. అందుకనే మీరు భరద్వాజగారి శిష్యులా అని సహృదయంతో, ఆదరాభిమానులతో దగ్గరైన వారెందరో వున్నారు. ఎందుకంటే బాగా ఎడ్యుకేట్ చేసి తెలిసిన విషయాన్ని నిర్మోహమాటంగా, నిర్భయంగా, విశదం చేయగల సత్తా ఇచ్చి మమ్మల్ని తీర్చిదిద్దారు. ఆయన దగ్గర కొచ్చిన ముడి సరుకు లాంటి ప్రతి వ్యక్తి కూడా ప్యూరిఫైడ్ మెటీరియల్ గా వెళ్ళిపోయేవాడు. ఆయన దగ్గరకు అందరూ శిలల్లాగా వచ్చి అందమైన శిల్పాల్లాగా వెళ్ళిపోయారు. నేను నాల్గు మాటలు చెప్పగల్గుతున్నానంటే భరద్వాజగారి ప్రభావం 100% నా మీద వున్నది. నేనప్పుడప్పుడు వృత్తి రీత్యా ఎక్కడో దూరప్రదేశాల కెళ్ళి మాట్లాడుంటాను. "మీదే వూరండి? మీకు ఫలానా భరద్వాజ గారు తెలుసా?" అని అంటే, తెలుసు అని ధైర్యంగా సంతోషంగా, గౌరవంగా చెప్పుకోగలం. ఆయన మమ్మల్ని తీర్చిదిద్దిన విధానం మాలో చెరగని ముద్ర వేసింది. అదే ఈ నాటికి కొనసాగిస్తున్నాం. ఎక్కడికి వెళ్ళినప్పటికి కూడా సరైనటువంటి ఆదరణ లభిస్తోంది. ఎవరు మమ్మల్ని ప్రతిఘటించటం అన్నది జరగలేదు. మాకు యాక్చువల్ గా శాస్త్ర పరిజ్ఞానం లేదు, తెలియదు. నవీనంగా, సైంటిఫిక్ గా విషయాన్నెలా చెప్పాలా అనే భావం మాలో నాటటం వల్ల మేం అలాగే తయారయ్యాం. మేం ఎన్నో కార్యక్రమాలు చేసినప్పటికి కూడా అందులో వున్నటువంటి స్పష్టత, అందులో వున్నటువంటి జ్ఞానం, అందులో వుండేటటువంటి హృదయం మాస్టార్ గారిని ఎక్కువగా, ప్రస్ఫుటంగా మనకు కన్పించేటట్టు చేస్తుంది. ఇలా తయారు చేయబడ్డ కార్యకర్తలు, వ్యక్తులు వేల మంది వున్నారు.

మాస్టర్ గారిలో ఎప్పుడూ ఏదో ఒక విషయాన్ని డిస్కస్ చేద్దామనో, ఏదో ఒక సబ్జెక్టు గురించి చెప్తామనో తపన వారిలో కన్పించేదే తప్ప "ఏదో ఒక రకంగా ఈ గంట కాలక్షేపం చేసి బయటపడ్డాం. అయిపోతుంది ఇవాళ్టికి అనేటటువంటి దృష్టి ఎక్కడా లేదు". ఎక్కడికి వెళ్దామన్నా వారు ఎప్పుడూ వెనకాడేవారు కాదు. "అయ్యో వూరికి చివరండి ఏమెళ్తాం" అంటే, "అయ్యయ్యో వెళ్ళాలి" అనేవారు. "వారు ముస్లిమ్స్ అండి. వాళ్ళకి మనమేం చెప్తాం" అంటే, "కాదు వెళ్ళాలి" అని బయల్దేరేవారు. "ఫలానా వూళ్ళో నాస్తికులు మొన్ననే బ్రహ్మాండంగా మీటింగ్స్ పెట్టారు ఇంకా వారం కూడా కాలేదండి. ఇప్పుడు ఆ వూరెందుకండి" అంటే, అందుకే అక్కడికే వెళ్ళాలి" అని ఎంతో వుత్సాహం చూపేవారు. ఏదైనా పోరాటం అనే మాట వారెవరో చెప్తే విన్నానే తప్ప అసలు పోరాటమంటే ఏమిటో మాస్టర్ గార్నే చూశాను. ఉదాహరణకి మారెళ్ళ అన్న గ్రామంలో భయంకరంగా నాస్తికులు ప్రచారం చేసి వెళ్ళిపోయారు. ఆ మర్నాడే మేం వెళ్లి ప్రచారం చేస్తే, "అయ్యయ్యో నిన్ననే వాళ్ళు చెప్పింది విన్నామండి. మీరు చెప్పిన తర్వాతగాని దీన్లో ఇన్ని విషయాలున్నాయని మాకు తెలీదు" అన్నారు. అట్లా "ఎక్కడైనా మత ప్రచారం జరుగుతున్నదండి? ఇక్కడి మూఢత్వం, ఛాందస సాంప్రదాయం ప్రబలంగా వుందండి" అంటే, "అక్కడి కెళ్ళి వాస్తవాన్ని చెప్తాం. అసలు అక్కడికెళ్ళి ఏం జరుగుతుంది, ఏమౌతుంది, వ్యక్తితో మనకెప్పుడూ తగాదా లేదు కదా! వారెవరో, మనమెవరో మన సిద్ధాంతాన్ని మనం చెప్తాం. వాళ్ళేమన్నా ప్రభావితులైతే మన్లో కొచ్చేస్తారు. మనకు తెలియని విషయాలు వాళ్ళలో వున్నాయా తెలుసుకుందాం. నష్టం ఏముంది" అనేటటువంటి ధోరణిలో వుండేదే కాని వారిలో కక్ష కార్పణ్యం లాంటివి వుండేవి కాదు. వారితో పరిచయం ఏర్పడిన తర్వాత వారిని తరచి తరచి చూస్తే ఆయనలో మహనీయుల లక్షణాలు ఎన్నో.. ఎన్నెన్నో.

# ద్వారకామాయి అనుభవమండపము

***శ్రీమతి భాగ్య, అనంతపురం***

నేను 10వ తరగతి చదువుతున్నప్పుడు మొట్టమొదట బాబా గురించి నాకు తెలిసిన ఒక అన్న చెప్పారు. మాది ఆర్థికంగా చాలా వెనుకబడిన కుటుంబం. ఇంట్లో అందరం చాలా యిబ్బందులు పడేవాళ్ళం. ఈ బాధలు తట్టుకోలేక ఒకరోజు అన్నతో చెప్పుకున్నాను. అప్పుడు ఆ అన్న "ఓం సాయి నమో నమః, శ్రీ సాయి నమో నమః, జయ జయ సాయి నమో నమః" అనే నామం చెప్పి, "ఇది ఎప్పుడూ స్మరించుకో, బాధలు తగ్గుతాయి" అని చెప్పాడు. అప్పుడున్న పరిస్థితుల్లో ఆ బాధలు తట్టుకోలేక రాత్రి పగలు ఆ నామం స్మరిస్తూ వుండేదాన్ని. ఆ నామస్మరణ ఫలితంగా నాకు ఆకలి బాధించకపోవడం, నిద్ర లేమి వుండకపోవడం యివన్నీ జరిగి, శరీరం దూదిపింజలా వుండేది. ఎన్ని కష్టాలున్నా అవి నన్ను బాధించకపోవడం చాలా ఆశ్చర్యాన్ని కలిగించేది. అప్పుడు నాకు బాబావారి మీద చాలా నమ్మకం కలిగింది.

తర్వాత నేను ఇంటర్ చదువుతున్నప్పుడు నాకు తెలిసిన వాళ్ళు 'శ్రీగురుచరిత్ర' గ్రంథం పారాయణ చేసుకోమని ఇచ్చారు. ఆ గ్రంథం పారాయణ చేస్తే మన గురువు ఎవరో మనకు తెలుస్తుంది అనే విషయాన్ని చెప్పారు. నేను చాలా ఆత్రుతగా నా గురువు ఎవరో తెలుసుకోవాలి అనే ఉద్దేశంతో సప్తాహ పారాయణ మొదలు పెట్టాను. సరిగ్గా బుధవారానికి సప్తాహం పూర్తయిన రోజు రాత్రి, సమర్థ సద్గురు సాయినాథులు స్వప్న దర్శనమిచ్చారు. మా అనంతపురంలో నేను ఎప్పుడూ వెళ్ళే బాబా గుడికి స్వప్నంలో కూడా వెళ్లాను. అప్పుడు బాబా ఆ విగ్రహం నుంచి తన నిజస్వరూపంతో బయటకు వచ్చి నాకు అతి సన్నిహితంగా దగ్గరగా నిల్చొని వున్నారు. నేను బాబాని చూసి ఆనందంతో, "బాబా నాకు జీవితాంతం తోడుంటావా" అని అడిగాను. "ఓ తప్పకుండా వుంటాను" అన్నారు "మా అమ్మకి కూడా తోడుంటావా?" అని అడిగాను. "అలాగే వుంటాను" అన్నారు. అయితే చేతిలో చెయ్యి వేసి చెప్పమని అడిగాను. అలాగే నా చేతిలో చేయి వేసి చెప్పారు. అది నా మొట్టమొదటి స్వప్నం. శ్రీ గురుచరిత్ర గ్రంథం చదివిన వెంటనే ఆ స్వప్నం వచ్చింది కనుక నేను బాబాని నా గురువు అని నమ్ముకున్నాను. అయితే అంత మాత్రం చేత నా కష్టాలు తగ్గలేదు. కానీ ఆయన నాకు అన్నింట్లో తోడుగా వుండి, వాటన్నింటినీ గట్టెక్కించారు.

కుటుంబంలో తీవ్రమైన ఒడిదుడుకుల వల్ల యిక ఒంటరిగా కుటుంబాన్ని నడపలేని పరిస్థితిలో మా అమ్మ నన్ను, మా తమ్ముడిని తీసుకొని మా అమ్మమ్మ వాళ్ల ఊరికి వచ్చేసింది. మా తమ్ముడు మానసిక వైకల్యం కలవాడు. తను ఏ పనీ చెయ్యలేడు. అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో కూడా పెళ్లి కావలసిన పిల్లలు వుండేవారు. ఒక రోజు నేను భోజనం చేద్దామనుకున్న సమయంలో మా అమ్మమ్మ వచ్చి 'పని చేస్తేనే భోజనం చేయాలి' అని గట్టిగా అరిచింది. ఆ మాటకి ఎందుకో గాని నేను చాలా తీవ్రంగా ఆందోళన పడ్డాను. అయితే ప్రతిరోజు అన్నంలో మొదటి ముద్ద బాబా కి సమర్పించి తినడం అలవాటు. అదే రకంగా ఆ రోజు ఒక ముద్ద తీసుకుని మేడమీదకు వెళ్ళి ఆ ముద్దని పక్కనే వున్న గట్టుమీద పెట్టి బాగా ఏడుస్తున్నాను. కాసేపయ్యాక పక్కన చూస్తే ముద్ద లేదు. కాకి కానీ, ఇంకేదైనా పక్షి కానీ తీసుకుంటే నాకు



తెలిసేది, పైగా పక్షులు తీసుకుంటే చిందరవందర చేసి తింటాయి. అలా కాకుండా నేను పెట్టిన ముద్ద మొత్తంగా అక్కడ లేకపోయేసరికి ఒక్కసారిగా నా మనసు తేలికపడి బాబా నా నైవేద్యం తీసుకున్నారు అన్న ఆనందంతో ఆ బాధంతా మాయమైపోయింది. ఆ రోజుల్లోనే ఏదో చిన్న ఉద్యోగంలో చేరి ప్రైవేట్ గా డిగ్రీ చదువుకున్నాను. ఈలోపు మా ఇంట్లో వాళ్ళు బైట సంబంధం తెచ్చే పరిస్థితి లేక నన్ను మా మామయ్యకిచ్చి పెళ్లి చేయాలని నిర్ణయించారు. కొన్ని కారణాల వల్ల నాకు ఆయన్ని చేసుకోవడం అసలు యిష్టం లేదు. కానీ అక్కడ నా మొర వినే వారెవ్వరులేరు. వెంటనే బాబాకి నా బాధ చెప్పుకొని మళ్ళీ పారాయణ మొదలుపెట్టాను. సరిగ్గా పారాయణ పూర్తయ్యేలోపు మా మావయ్య, 'నేను భాగ్యాని చేసుకోను' అని చెప్పాడు. నాకు చాలా ఆశ్చర్యము, సంతోషము కలిగింది. ఆ రకంగా మా పెళ్లి ఆగిపోయింది. తర్వాత మాకు తెలిసిన వాళ్ళ ద్వారా ఒక సంబంధం వచ్చి, నాకు అతనితో వివాహం అయింది. వాళ్లు మమ్మల్ని కట్నకానుకలేవీ అడగలేదు. పైగా ఖర్చు కూడా వాళ్లే పెట్టుకుని పెళ్లి చేసుకున్నారు. ఆయన చాలా మంచివారు నన్ను చాలా బాగా చూసుకుంటారు. నేను వివాహం అయిన తర్వాత నుంచి శ్రీగురుచరిత్రతో పాటు శ్రీసాయిలీలామృతము కూడా పారాయణ చేస్తున్నాను. మావారికి బాబా అంటే చాలా యిష్టం, విశ్వాసం కూడా.

మావారిదీ అనంతపురమే, కానీ వారు హైద్రాబాద్ లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. పెళ్లైన వెంటనే నేను హైద్రాబాద్ వచ్చేసాను. కొన్ని రోజుల తరువాత గర్భవతిగా వున్నప్పుడు, నా ప్రాణ స్నేహితురాలు మా ఇంటికి వచ్చింది. నేను బాబా గురించి ఎప్పుడూ చెప్తూ వుండటంవల్ల తనకి కూడా బాబా అంటే చాలా యిష్టం ఏర్పడింది. మా ఇంటికి వచ్చినప్పుడు "నీకు బాబు పుడతాడో, పాప పుడుతుందో, బాబాని అడుగుదామా" అన్నది. నేను 'అలా అడగకూడదు, ఏదిస్తే అది ప్రసాదంగా తీసుకోవాలి' అని చెప్పాను. 'సరదాగా ఒకసారి ప్రయత్నం చేద్దాం' అని చీటీలు వేసింది. 'బాబు పుడతాడు' అని వచ్చింది. నెలలు నిండిన తర్వాత నాకు బాబు పుట్టాడు. నా స్నేహితురాలు మావారికి ఫోన్, చేసి 'ప్రసవం అయిందా? ఎవరు పుట్టారు?' అనడిగితే మావారు 'పాప పుట్టింది' అని చెప్పారట. అదేంటీ బాబా చెప్పిన మాట తప్పయింది,,, అనుకుంటూ, పాపకి ఒక గౌను కొని ఆసుపత్రికి వచ్చింది. నా దగ్గరికి రాగానే పుట్టింది పాప కాదు బాబు అని తెలిసింది. తను నాతో, "భాగ్య బాబా నీతో వున్నారు, ఆయన నీకు చెప్పిందే జరిగింది" అని చెప్పి చాలా సంతోషపడింది.

2016వ సంవత్సరంలో సొంతంగా వ్యాపారం పెట్టుకునే ఉద్దేశంతో, హైద్రాబాద్ నించి మళ్లీ అనంతపురం వచ్చాము. అక్కడ 'వుడెన్ షాప్' పెట్టుకున్నాము. అలా వ్యాపారం మొదలుపెట్టిన వారం రోజులకి మావారికి యాక్సిడెంట్ అయ్యి కాలు విరిగింది. చాలా బాధనిపించింది కానీ ఏం చేయలేని పరిస్థితి, బాబానే సరి చేస్తారు అన్న నమ్మకంతో పారాయణ చేసుకుంటూ వుండేదాన్ని. సాయినాథుని అనుగ్రహం వల్ల ఎన్ని కష్టాలు వస్తున్నా వారి మీద విశ్వాసం మాత్రం సడలలేదు. ఒకసారి స్వప్నంలో, నేను బాబాగుడికి వెళ్ళినప్పుడు, పాదుకల వైపు నమస్కారం చేసుకుంటుంటే విగ్రహం లోని బాబా నెమ్మదిగా తలతిప్పి కుడివైపున వున్న నావైపు చూసారు.

***మిగతా 29వ పేజీలో***

# ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీమతి అరుణ, ఒంగోలు

పూజ్యశ్రీ భరద్వాజ్ మహారాజ్ లీలావైభవాన్ని ఒంగోలు వాస్తవ్యులు శ్రీమతి అరుణగారు, ఈ విధంగా తెలియచేస్తున్నారు.

మేము కొన్నాళ్ళు ఉప్పుగుండూరు లో ఉండేవాళ్ళం. అప్పుడు బాబా గుడికి ప్రతిరోజూ హారతికి వెళ్లేదాన్ని. అక్కడ అందరూ వేరే గురువుగారు రాసిన సాయి చరిత్ర చదివేవారు. నేను కూడా అదే చదివేదాన్ని. ఒకసారి మా అమ్మాయి చేత పారాయణ చేయిద్దామని నా పుస్తకం తనకిచ్చి, ఇంకొక పుస్తకం కోసం అక్కడ వాళ్ళని అడిగాను. ఆ పుస్తకాలు అయిపోయాయని చెప్పారు. ఈలోగా అక్కడున్న ఒక పెద్దాయన, నా దగ్గర ఈ గ్రంథం వుందని 'శ్రీ సాయిలీలామృతం' యిచ్చారు. సరే ఏదైనా సాయిచరిత్రేనని తీసుకున్నాను. కానీ, ఆ గ్రంథం చదువుతున్న కొద్దీ, విపరీతమైన ఆనందం కలిగింది. అంతేకాదు, ఏదో ఒక కళాశాలలో పనిచేసే ఆంగ్ల అధ్యాపకులు రాసిన గ్రంథంలా లేదు. రాసిన వ్యక్తి మానవమాత్రులు కాదనిపించింది. అంతే కాదు, బాబా తన చరిత్రని తానే రాసుకున్నారనిపించింది. ఒక్కసారి చదివాక ఆ గ్రంథాన్ని, నాకు యిాచ్చిన పెద్దాయనకి యిచ్చేసాను. మళ్ళీ చదవాలనిపించింది. కానీ యెంత ప్రయత్నించినా దొరకలేదు.

మేము 2012 లో ఒంగోలుకి వచ్చేసాం. అక్కడ లాయరుపేటలో పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దర్శనం చేసుకుని, శ్రీ సాయి లీలామృతం గ్రంథం కొనుక్కున్నాను. అందులో, శ్రీ గురుచరిత్ర గ్రంథం కూడా చాలా ముఖ్యమైనదని రాశారు, వెంటనే ఆ గ్రంథం కూడా కొనుక్కుని పారాయణ చేసాను. వైజాగ్ మా పుట్టిల్లు. ఒకసారి అక్కడికి వెళ్ళినప్పుడు, మాకు తెలిసినవాళ్ళు, నవ గురువారాల వ్రతం చెప్పారు. ఒంగోలుకి వచ్చాక ఆ వ్రతం చేసాను. అయితే ప్రతి గురువారం పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధికి 108 ప్రదక్షిణలు చేసేదాన్ని. నా స్నేహితురాలు సుధారాణి, నాకు మిగిలిన మహాత్ముల చరిత్ర గ్రంథాలన్నీ యిచ్చింది. మేమిద్దరం ప్రతి గురువారం 108 ప్రదక్షిణాలు పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధికి చేసేవాళ్ళం. నాకు చాలా ఆరోగ్య సమస్యలున్నాయి. ఈ ప్రదక్షిణలు చేయడం వల్ల చాలా వరకు తగ్గేవి. ఈ గురువారం ప్రదక్షిణ చేసి ఇంటికి వెడితే, వచ్చే గురువారం వరకు పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల, హాయిగా వుండేది. అందుకే ప్రతి గురువారం ప్రదక్షిణలు చేసేదాన్ని.

ఒకసారి దత్తజయంతికి పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధికి 108 ప్రదక్షిణలు చేసాను. అదేరోజు రాత్రి పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్న దర్శనం ఇచ్చారు. సమాధిలో పూజ్యశ్రీ మాస్టరుగారు బంగారు శేషతల్పం మీద విపరీతమైన తేజస్సుతో, లుంగీ, చొక్కా వేసుకుని శయనిస్తూ కనిపించారు. నా కళ్ళకు ఆ కాంతిని తట్టుకోవడం కష్టం అనిపించింది. కాస్సేపటికి ఆయన సమాధినించి బయటికి వచ్చి, నన్ను దోసిలి పట్టమని, నా చేతినిండా రాళ్లు వేశారు. నేను కింద పడేసాను. మళ్ళీ ఈసారి, గోళీలు వేశారు. అవీ పడేసాను. తరవాత జీడిపప్పు వేశారు, అదీ పడేసాను. ఈసారి డబ్బులు వేశారు. అవీ పడేశాక, పూజ్యశ్రీ మాస్టరుగారు నా చేయి పట్టుకుని, ఒక బడిలోకి తీసుకువెళ్లి, ఒక వ్రాతబల్ల(బోర్డు) మీద వున్న అక్షరాలు చూపించారు. అవి హిందీభాష లో రాసివున్నాయి. నాకు అర్థం కాలేదు, పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా ఏమి, చెప్పలేదు. సమయం వచ్చినప్పుడు వారినే వివరించమని ప్రార్థించాను.

మా అబ్బాయిని పై చదువులకోసం అమెరికా పంపించాలని మా ఉద్దేశం. దానికి సంబంధించిన ఋణం (లోన్) మంజూరు కావటం లేదు. ఒకరోజు నేను పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధిపైన

పరచే వస్త్రం సమర్పించడానికి సమాధి మందిరానికి వెళ్లాను. అప్పుడు ఈ ఋణానికి సంబంధించిన వాళ్లు, ఇంటికి విచారణకు (ఎంక్వయిరీ) కి వచ్చి, ఋణం మంజూరు చేశారు. మందిరంలో నేను పూజ్యశ్రీ మాస్టరుగారి సేవలో వుంటే, దాదాపు ఆశలు వదులుకున్న మా సమస్యని, పూజ్యశ్రీ మాస్టరుగారు తీర్చారు అనిపించింది. ఇలా ఎన్నో పరిస్థితులలో మమ్మల్ని ఆదుకుంటున్నారు. తిరిగి వారికి మనం చేసేది ఏముంటుంది, వారి పాదాలను ఆశ్రయించుకుని వుండటం తప్ప!!

ఒకసారి నాకొక స్వప్నం వచ్చింది. అందులో పూజ్యశ్రీ మాస్టరుగారు, ఒక పచ్చిక మైదానం లో కుర్చీలో కూర్చుని వున్నారు. చాలా మంది భక్తులు వారి చుట్టూ కూర్చుని వున్నారు. ఒకొక్కరూ పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకి వెళ్లి నమస్కారం చేసుకుని, వాళ్ళ కోరికలు విన్నవించుకుంటున్నారు. నేను చివరిలో వెళ్లాను. నమస్కారం చేసుకోగానే, "నీకేం కావాలమ్మా" అని పూజ్యశ్రీ మాస్టరుగారు నన్నడిగారు. నేనేమి మాట్లాడకుండా వారి కాళ్ళమీద పడి, నమస్కారం చేసుకున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు చిరునవ్వుతో చూస్తున్నారు!!

2021 సంవత్సరం మార్చి నెలలో వచ్చిన శివరాత్రి రోజు సమాధి మందిరానికి వెళ్లి నమస్కారం చేసుకుని వచ్చాను. ఆ రోజు రాత్రి కొంచెం ఆలస్యంగా నిద్రపోయాను. లింగోద్భవ సమయంలో నాకు ఒక స్వప్నం వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి లోనించి, పెద్ద వెలుగువచ్చింది. దానితో సమాధి మందిరమంతా వెలిగిపోయింది. అంతటి వెలుగును వారు చూపిస్తేనే మనం చూడగలం అనిపించింది. లింగోద్భవ కాలంలో పూజ్యశ్రీ మాస్టరుగారు, ఆ విధంగా సమాధినించి బయటకు వచ్చిన దృశ్యాన్ని స్వప్నంలో నాకు చూపించారు. నిజానికి ఆ సమయానికి సమాధి మందిరంలో వున్నా, అదే సంఘటన జరిగినా ఆ దృశ్యం ప్రత్యక్షంగా ఎవరికీ గోచరించి వుండకపోవచ్చు. కరుణామయులు పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు అంత చక్కటి అనుభవాన్ని ప్రసాదించారు.

ప్రతిరోజూ, ప్రతిక్షణం వారి స్మరణలో, సేవలో మా జీవితాలు తరించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను. ●

## ద్వారకామాయి అనుభవ మంటపము

27వ పేజీ తరువాయి

ఆ స్వప్నం ఎప్పుడు తలచుకున్నా చాలా ఆనందవేస్తుంది. అంటే ప్రతి సన్నివేశంలోనూ ఏదో ఒక అనుభవాన్ని ప్రసాదించి 'నేను నీతో వున్నాను నువ్వు బాధపడకు' అని చెప్పినట్టు అనిపించి మనోధైర్యం కలుగుతుంది. మావారు కోలుకున్నాక వ్యాపారం బాగా నడుస్తున్న సమయంలో, మా దగ్గర పనిచేసే ఒక అబ్బాయి మీద తలుపు చెక్కపడి అతను చనిపోయాడు. వాళ్ళ కుటుంబ సభ్యులు 10 లక్షలు యిమ్మని ఒత్తిడి చేశారు. కొంతమంది సన్నిహితులు "మీరు అంతెక్కడి నుంచి తెస్తారు కోర్టుకు వెళ్ళం" డని చెప్పారు. 'కోర్టుకెళ్లినా చాలా డబ్బులు ఖర్చు అవుతాయి వాళ్ళు అడిగిన డబ్బులు యిస్తే వాళ్ళు ప్రశాంతంగా బతుకుతారు కదా' అని మాకు అనిపించి, అతిప్రయత్నం మీద వాళ్ళకి ఆ డబ్బులు చెల్లించాము. ఆ తర్వాత నుంచి మా వ్యాపారం బాగా అభివృద్ధిలోకి వచ్చింది. ఇప్పుడు అనంతపురంలోనే సొంతంగా ఇల్లు కూడా కట్టుకుంటున్నాము.

అయితే శ్రీ సాయిలీలామృతం, శ్రీ గురుచరిత్ర గ్రంథాలు చదువుతున్నా కూడా పూజ్యశ్రీ మాస్టరుగారి మీద 'ఆయన గ్రంథ రచయిత' అన్న అభిప్రాయమే ఉండేది. కానీ తర్వాత కొంతమంది సత్సంగ సభ్యులు పరిచయమై పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతటి గొప్పవారో చెప్పడం వల్ల వారి మీద కూడా గౌరవభావం కలిగింది. పూజ్యశ్రీ మాస్టరుగారి రచనలు అన్నీ చదవడం వల్ల నా జీవితాన్ని ఎంతో మార్చుకున్నాను. నాకు చాలా ఎక్కువ కోపం, విసుగు యిలాంటివన్నీ వుండేవి. మావారు చాలా శాంత స్వభావం కలవారు. నాలోని ఈ గుణాలతో చాలా యిబ్బంది పడేదాన్ని, పెట్టేదాన్ని. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారి రచనలు పారాయణ చేయడం వల్ల నాలో చాలా చాలా మార్పు వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన మహాత్ములందరి చరిత్రలు పారాయణ చేస్తున్నప్పుడు వాళ్ళ కృప విశేషంగా నా మీద వుంటుంది. ఇదంతా పూజ్యశ్రీ మాస్టరు గారి దయ!!

ఆ విధంగా శ్రీ బాబావారు నన్ను ఆదరించి అక్కున చేర్చుకుని, ఇప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారికి అమ్మగారికి అప్పచెప్పారు. వారందరి ఆశీస్సులు పరిపూర్ణంగా వుండాలని ప్రార్థిస్తూ,,,,,,జై సాయి మాస్టర్!! ●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

**శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

**శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

**ఇతర మహాత్ముల గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

**అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

**ధ్యాన సంబంధమైన గ్రంథములు**

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

**ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

**ఇతర గ్రంథములు**

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

**పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ (రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

**బాలల కొరకు విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

**BOOKS IN ENGLISH**

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master *(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

**BOOKS IN OTHER LANGUAGES**

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |